## ఆప్యాయంగా పలకరించి అన్నగా అండగా నిలిచి..

**ప్రమాదంలో రెండు కాళ్లను, తండ్రిని కోల్పోయిన యువకుడికి చేయూత**

**మూడు చక్రాల బండి, అర్హతను బట్టి ఉద్యోగం కల్పించాలని ఆదేశం**

**మానవత్వం చాటుకున్న మంత్రి శ్రీనన్న**

**మహబూబ్‌నగర్ ప్రతినిధి,జనవరి 27 ప్రభాతవార్త :** ఉపాధిలేక దిక్కు తోచని పరిస్థితిలో ఉన్న పాతపాలమూరు దోభీఘాట్‌కు చెందిన మహేష్ చారికి అండగా నిలిచారు మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్. మహబూబ్‌నగర్ మున్సిపల్ పరిధిలోని 23వ వార్డులో జిల్లా వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించి వెళ్తున్న క్రమంలో పాత పాలమూరుకు చెందిన దోభీఘాట్ వాసి మహేష్‌చారి దీనస్థితిని స్థానిక బిఆర్ఎస్ నాయకుడు నవకాంత్ ద్వారా వివరాలు తెలుసుకుని చలించిపోయారు. గతలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తన రెండు కాళ్లను, అనంతరం తన తండ్రి సత్యనారాయణచారిని పోగొట్టుకుని ఉపాధిలేక ఇబ్బంది పడుతున్న మహేష్‌చారికి వెంటనే మూడు చక్రాల వాహనాన్ని, అతని విద్యార్హతను బట్టి ఉద్యోగాన్ని కల్పించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా అధికారులను ఆదేశించారు. సమస్య తెలుసుకున్న వెంటనే మంత్రి స్పందించి యువకుడికి అండగా నిలవడంతో స్థానికులు అభినందించారు.



మహేష్ చారితో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి

**కల్వకుర్తి, జనవరి 27 ప్రభాతవార్త:** కల్వకుర్తి నియోజకవర్గంలోని తలకొండపల్లి మండలం మెదక్‌పల్లి గ్రామానికి చెందిన చెన్నయ్యకు మంజూరైన రూ.60వేలు, వెల్దండ మండలం చెదురుపల్లి గ్రామానికి చెందిన పి.ఎల్లమ్మకు మంజూరైన రూ.28వేలు, వెల్దండ మండల కేంద్రానికి అబ్దుల్ జలీల్‌కు రూ.31 వేలు, మాడ్గుల మండల కేంద్రానికి చెందిన లక్ష్మమ్మకు రూ.60 వేల చొప్పున మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శుక్రవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ సీఎం సహాయనిధి అంటే ఇంతకు ముందు ఎవ్వరికి తెలియదని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ సీఎం సహాయనిధి ధరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి కొంత ఆర్థిక సహాయం అందిస్తున్నారన్నారు.కార్యక్రమంలో ఆయా మండలాల నాయకులు తదితరులు ఉన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి

## ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి గవర్నర్‌కు క్షమాపణ చెప్పాలి..

**బిజెపి మహిళామోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జయశ్రీ**

**మహబూబ్‌నగర్ ప్రతినిధి,జనవరి 27 ప్రభాతవార్త :** ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి వెంటనే గవర్నర్ తమిళిసైకి క్షమాపణ చెప్పాలని భారతీయ జనతా పార్టీ మహిళామోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జయశ్రీ డిమాండ్ చేశారు. ఇదే విషయమై శుక్రవారం పాలమూరు జిల్లా మహిళా మోర్చా ఆధ్వర్యంలో జడ్చర్ల పోలీస్ స్టేషన్‌లో కౌశిక్‌రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈసందర్భంగా జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాజ్యాంగాన్ని అవమానపరు స్తూ రాజ్యాంగ బద్దంగా నియమితులైన గవర్నర్‌ను కించపరుస్తూ బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి మాట్లాడడం సరికాదన్నారు. బిఆర్ఎస్ పార్టీలో రోజు రోజుకు మహిళలకు గౌరవం ఇచ్చే మర్యాద లేకుండా పోయిందన్నారు. సొంత పార్టీకి చెందిన మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఒక మహిళ అని చూడకుండా వేధిస్తున్నారని పత్రిక ముందుకొచ్చి కన్నీరు పెట్టుకుని పదవికి రాజీనామా చేస్తున్నట్లు పత్రికల ముందు ప్రకటించడం బాధాకరమ న్నారు. రానున్న రోజుల్లో మహిళలు బిఆర్ఎస్‌కు తగిన గుణపాఠం చెప్తారని ఆమె విమర్శించారు. మహిళల పట్ల చులకన భావంతో బిఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారని అది వారికే మంచిది కాదని అన్నారు. రాజ్యాంగ బద్దంగా నిర్వహించుకోవాల్సిన గణ తంత్ర వేడుకలను బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించకపోగా ఒక మహిళా గవర్నర్‌ను అవమానపరుస్తూ మాట్లాడడం బాధాకరమన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని గౌరవించని బిఆర్ఎస్ ప్రభుత్వానికి ఇకకాలం చెల్లిందని విమర్శించారు. ఈ సమావేశంలో మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ అచ్చుగట్ల అంజయ్య, పట్టణ అధ్యక్షులు నారాయణ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షురాలు యాదమ్మ, నాగరాజు, మోహన్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జయశ్రీ

## బదిలీపై వెళ్తున్న ఎస్పీకి బిజెపి నాయకుల సన్మానం

**గద్వాల టౌన్,జనవరి 27 ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల జిల్లా ఎస్పీ రంజన్ రతన్‌కుమార్ బదిలీపై వెళ్తున్న సందర్భంగా ఎస్పీని బిజెపి నాయకులు సన్మానించారు. ఎస్పీని సన్మానించిన వారిలో గద్వాల జిల్లా అధ్యక్షులు ఎస్. రామచంద్రారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ధరూర్ పెద్ద కృష్ణన్న, గద్వాల పట్టణ అధ్యక్షులు బండల వెంకటరాములు, జిల్లా యువమోర్చా అధ్యక్షులు మిర్జాపురం వెంకటేశ్వర్‌రెడ్డి, ఓబిసి రాష్ట్ర అధికార ప్రతినిధి నాగేంద్ర యాదవ్,నాయకులు గీతారెడ్డి, కేశవ్ తదితరులు పాల్గొన్నారు.



బదిలీపై వెళ్తున్న ఎస్పీని సన్మానిస్తున్న బిజెపి నాయకులు

## వనపర్తి జిల్లా ఎస్పీగా బాద్యతలు స్వీకరించిన రక్షిత కె.మూర్తి

**వనపర్తి జిల్లాకు 3వ మహిళా ఎస్పీగా బాధ్యతల స్వీకరణ..**

**వనపర్తి క్రైమ్,జనవరి 27 ప్రభాతవార్త:** గురువారం వనపర్తి జిల్లా నూతన ఎస్పీగా రక్షిత కె మూర్తి బాద్యతలు స్వీకరించారు. ప్రస్తుత ఎస్పీ కె.అపూర్వ రావు నల్గొండ జిల్లాకు బదిలీ కాగా ఆమె స్థానంలో 2015 బ్యాచ్ కు చెందిన రక్షిత కె మూర్తి బాద్యతలు సీకరించారు. బాద్యతలు స్వీకరించిన ఎస్పీ ని జిల్లా అదనపు ఎస్పీ షాకీర్ హుస్సేన్, డీఎస్పీ ఆనంద్ రెడ్డి, సీసీఎస్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస చారి, రిజర్వ్ ఇన్స్పెక్టర్ జగన్, వెంకట్, సీఐ లు, ఎస్సైలు, డీపీఓ సిబ్బంది తదితరులు ఆమెకు స్వాగతం పలికారు.



నూతన ఎస్పీ రక్షిత కె మూర్తి




# మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట


# మన్యం కొండను ... అద్భుతంగా తీర్చుదిద్దుతాం..

- ఈ నెల 31 నుండి ఫిబ్రవరి 7 వరకు బ్రహ్మోత్సవాలు
- ఫిబ్రవరి 5న రథోత్సవం
- తెలంగాణలోనే మొదటి కేబుల్ కార్ కొండపైకి ఏర్పాటు
- భక్తుల సౌకర్యాలు, వసతుల కల్పనకు పెద్దపీట
- భక్తుల రద్దీకి అనుగుణంగా పార్కింగ్,రవాణ,శానిటేషన్
- అధికారులంతా భాగస్వాములు కావాలి
- పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- ఉత్సవాల నిర్వహణపై ఉన్నతస్థాయి సమీక్ష



బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, కలెక్టర్, ఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్



హాజరైన అధికారులు, సిబ్బంది

**హబూబ్‌నగర్ ప్రతినిధి, జనవరి27,ప్రభాతవార్త:** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో అతిపెద్ద దేవాలయమైన మన్యంకొండ బ్రహ్మోత్సవాలు విజయవంతం చేసేందుకు అధికారులు భాగస్వాములు కావాలని పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అధికారులను ఆదేశించారు. మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ వెంకట్రావు, అదనపు కలెక్టర్లు, ఎస్పీ ఇతర ఉన్నతాధికారులతో మన్యంకొండ బ్రహ్మోత్సవాలపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తుల రద్దీకి అనుగుణంగా శానిటేషన్, లైటింగ్, నీటి సదుపాయం, రవాణా, పార్కింగ్ తదితర ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోనే మొదటి కేబుల్ కార్‌ను కొండపైకి వెళ్లేందుకు నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తుల సౌకర్యాలకు పెద్దపీట వేయాలని, ఏ ఒక్కరికీ ఇబ్బంది కలుగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వచ్చే ఏడాది వరకు ఆలయం వద్ద భక్తులకు శాశ్వతంగా ఉండేలా ఏర్పాట్లు చేయాలని, వసతులు కల్పించాలని సూచించారు. అన్ని రకాల విభాగాలు, సిబ్బంది, డిపార్ట్‌మెంట్లు సమన్వయంతో ముందుకుసాగాలని ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ అతి ప్రాచీన పేరుగాంచిన ఆలయం, పేదల తిరుపతిగా విరాజిల్లుతున్నదని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడకముందు కోనేరులో కనీసం స్నానాలు చేయడానికి కూడా నీళ్లు ఉండని పరిస్థితి ఉండేది. నేడు 18 ప్రత్యేక గదులతో విశాలమైన రోడ్లు, పార్కింగ్, నీటి వసతితో ఆలయం అత్యంత అద్భుతంగా తయారు కానున్నట్లు తెలిపారు. దక్షిణ తెలంగాణలో అతిపెద్ద దేవాలయం కావడంతో సీఎం కేసీఆర్ కూడా అడిగిన వెంటనే నిధులు కూడా మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. కొండకింద చెరువులో శుద్ధజలం నింపి బోటింగ్ సదుపాయం, మూవింగ్ హోటల్‌తోపాటు, హరిత టూరిజం హోటల్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు తేజస్‌నందలాల్ పవార్, సీతారామారావు, ఎస్పీ కే నరసింహ ఏఎస్పీ రాములు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్,మన్యంకిండ ఆలయ చైర్మన్ మధుసూదన్ పాల్గొన్నారు.

## జిల్లాలో ఉపాధ్యాయులు, పదోన్నతుల బదిలీల ప్రక్రియ ప్రారంభం...

- బదిలీలు, పదోన్నతుల ధరఖాస్తులు అన్ని ఆన్‌లైన్‌లో...
- జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎం.గోవిందరాజు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 27 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లాలో శుక్రవారం నుంచి ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ ప్రారంభమయ్యాయని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎం.గోవిందరాజులు శుక్రవారం తెలిపారు. జిల్లా కలెక్టర్ సారథ్యంలో ఉపాధ్యాయులు బదిలీలు పదోన్నతులను పకడ్బందిగా నిర్వహిస్తామన్నారు. క్యాడర్ల వారీగా ఖాళీల వివరాలను ఆయన వెల్లడించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో 825 పాఠశాలలు ఉన్నాయని, విద్యార్థుల సంఖ్యలేని 30 పాఠశాలల్లో ఉన్న 34 ఖాళీలను వెల్లడించడం లేదని తెలిపారు. ఉపాధ్యాయుల స్పౌట్ కేటగిరి బదిలీలకు అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినందన్నారు. ఉపాధ్యాయ దంపతులను ఒకే చోటుకు బదిలీ చేస్తూ 26 మంది నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి రంగారెడ్డి మరియు మహబూబ్‌నగర్ జిల్లాలకు బదిలీలపై వెళ్లిన ఉపాధ్యాయుల ఖాళీల వివరాలను సైతం వెల్లడించినట్లు ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జీవో 5ను ఈ నెల 25న జారీ చేసిందన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో ప్రధానోపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు ఎనిమిది సంవత్సరాలు పాఠశాలలో సర్వీస్ పూర్తి చేసిన ఉపాధ్యాయులందరికి బదిలీలు చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ నెల 28 నుంచి 30 వరకు బదిలీల కోసం ఆన్‌లైన్ ధరఖాస్తులు చేసుకోవాలన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో కలెక్టర్ సారథ్యంలో బదిలీలు, పదోన్నతులు, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని డీఈఓ తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ గోవిందరాజులు

## హరితహారం మొక్కలు ఎండిపోకుండా నీరుపెట్టాలి..

**అదనపు కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్**

**మహబూబ్‌నగర్ బ్యూరో,జనవరి 27 ప్రభాతవార్త :** హరితహారం కింద నాటిన మొక్కలు ఎండిపోకుండా ప్రతి శుక్రవారం క్రమం తప్పకుండా నీరు పెట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ అన్నారు. శుక్రవారం ఆయన రెవెన్యూ అదనపు కలెక్టర్ కె.సీతారామారావుతో కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మొక్కలకు నీరు పోశారు. కలెక్టర్ కార్యాలయంలోని మొక్కలు, గార్డెనింగ్ సంరక్షణ, చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటడం, మొక్కలకు ఎప్పుడు క్రమం తప్పకుండా నీరందించే విధంగా తీసుకోవాల్సిన చర్యలపై ఉద్యానశాఖ ఎడి సాయిబాబా, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అనంతరం తేజస్ నందలాల్ పవర్ మాట్లాడుతూ హరితహారం కింద జిల్లాలో అన్ని గ్రామాలు, పట్టణాలలో నాటిన మొక్కలకు రెగ్యులర్‌గా నీరు పెట్టాలని చెప్పారు. ముఖ్యంగా రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని రహదారులకు ఇరువైపులా నాటిన మొక్కలు, సంస్థలలో నాటిన మొక్కలు అన్ని రకాల మొక్కలకు నీరు పెట్టాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శంకర్ తదితరులు ఉన్నారు.





హరితహారం మొక్కలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్

## నాగర్‌కర్నూల్ జిల్లాతో జమునకు అనుబంధం..





1984లో కాంగ్రెస్ ఎంపీ మల్లుఅనంతరాములు తరుపున ప్రచారానికి వచ్చిన సందర్భంలో మీడియాతో మాట్లాడుతున్న జమున.. హరికథలో పద్మాలయకు అవార్డు అందజేస్తున్న జమున

## జోగులాంబ గద్వాల జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన కె. సృజన..

**2012 బ్యాచ్‌కు చెందిన గ్రూప్ 1 అధికారి**

**గద్వాల టౌన్,జనవరి 27 ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల జిల్లా నూతన ఎస్పీగా కె. సృజన శుక్రవారం బాధ్యతలు స్వీకిరంచారు. ప్రస్తుత ఎస్పీ రతన్‌కుమార్ నుండి కె. సృజన బాధ్యతలు స్వీకరించారు. 2012 బ్యాచ్ గ్రూప్ 1 అధికారి అయిన ఎస్పీ, డీఎస్పీ, అడిషనల్ ఎస్పీగా వివిధ ప్రాంతాలలో సేవలందించారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో తనకు విధులు నిర్వహించిన అనుభవం ఉందని, ఇక్కడి ప్రజలు ఎంతో సౌమ్యులుగా ఉంటారని అన్నారు. ప్రజలకు మంచి సేవలు అందించేందుకు మీడియా, ప్రజల సపోర్టు అవసరం అని అన్నారు. నేరాలు జరిగాక కేసులు చేదించేకన్నా ముందుగానే నేరాలు జరగకుండా తగు చర్యలు తీసుకునేందుకు మొదటి ప్రాధాన్యం ఇస్తామని అందుకు ప్రజల సపోర్టు ఉండాలని, ఎలాంటి ఇన్ఫర్మేషన్ ఉన్న పోలీస్ వారికి తెలియజేయాలని అన్నారు. ప్రజలతో ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను కొనసాగిస్తామని, అలాగే క్రిమినల్స్‌కు ఆంటి ఎలిమెంట్స్ కొనసాగించే వారికి ఫ్రెండ్లీ పోలీసింగ్ వర్తించదని అన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాకు 6వ ఎస్పీగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన కె. సృజనకు జిల్లా డీఎస్పీ ఎన్‌సిహెచ్ రంగస్వామి, కార్యాలయ ఏఓ సతీష్‌కుమార్, ఎస్బీడిసి ఆర్బీ ఇన్స్‌పెక్టర్ శివకుమార్, శ్రీనివాస్, గద్వాల సిఐ చంద్రశేఖర్, అలంపూర్ సిఐ సూర్యనాయక్, శాంతినగర్ సిఐ శివశంకర్, సిసి లోహిత్, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్లు నగేష్, పెద్దయ్య, ఎస్సైలు, డిపిఓ సిబ్బంది, ఐటి, డిసిఆర్బీ, ఎస్బీ సిబ్బంది భరోసా సిబ్బంది తదితరులు ఎస్పీకి స్వాగతం పలికారు.



జోగులాంబ గద్వాల జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరిస్తున్న సృజన



నూతన ఎస్పీకి స్వాగతం పలుకుతున్న డీఎస్పీ, సిఐలు

## పేదల వివాహాలు... పెద్దల వివాహాలకు ధీటుగా నిర్వహిస్తాం...

- ఫిబ్రవరి 12న ఉదయం 11 గంటలకు 225 జంటలకు ఒకే వేధికపై వివాహాలు
- ఎంజెఆర్ ట్రస్ట్ ద్వారా భారీ ఏర్పాట్లు
- ఎంజెఆర్ ట్రస్ట్ అధినేత, ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి,జనవరి 27 ప్రభాతవార్త:** ఎంజెఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిర్వహిస్తున్న సామూహిక వివాహాలకు ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా శుక్రవారం కళ్యాణ మండపం, వేధికకు వాస్తు, భూమి పూజను ఎంజెఆర్ ట్రస్ట్ అధినేత, ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి దంపతులు వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ పేదింటి ఆడ పిల్లల వివాహాలను పెద్దింటి వివాహాలకు ధీటుగా నిర్వహించాలనే సంకల్పంతో తమ ట్రస్ట్ ద్వారా బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ఇప్పటి వరకు నాలుగు పర్యాయాలు 600పై చిలుకు జంటలకు సామూహిక వివాహాలు జరిపించామని, ఈ పర్యాయం ఫిబ్రవరి 12న 225 జంటలకు ఒకే వేదికపై కుల, మతాలకు అతీతంగా వివాహాలు నిర్వహిస్తున్నామన్నారు. గతంలో ఈ కంటే ఈ సారి మరింత కన్నుల పండువగా వివాహాలు నిర్వహిస్తున్నామని, ఒక్కో జంటకు ఒక ముత్యాల పందరిని ఏర్పాటు చేసి పండితులు, ఇరువురి కుటుంబ సభ్యులు ఒకే చోట తమ ఇంటి ఆవరణలో వివాహం జరుగుతుందా అన్నంత అభూమి కలిగే విధంగా వివాహాలు జరిపిస్తామన్నారు. ముత్యాల పందిళ్లను ఏపీకి చెందిన కర్నూల్ రాజమండ్రిల నుంచి రప్పించి ప్రత్యేక ఆకర్షణీయంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. వివాహా సమయంలో ఆడపడుచుకు ఇచ్చి పంపించే అన్ని రకాల వస్తువులను ట్రస్ట్ ద్వారా అందిస్తున్నామన్నారు. ఆకాశమంత పందిరి వేసి నిర్వహిస్తున్న పేదల వివాహాలకు పార్టీలకతీతంగా వచ్చి దంపతులను ఆశీర్వదించాలని మర్రి కోరారు. పేదరికంలో తాను తన చెల్లి పెళ్లి కోసం పడ్డ ఇబ్బందులు పేదింటి కుటుంబాల్లో ఎవ్వరు పడవద్దని భావించి ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టానని, ఎంజెఆర్ ట్రస్ట్ ద్వారా ఇప్పటి వరకు 4 పర్యాయాలు వివాహాలు జరిపించానని, 5వ పర్యాయం ఫిబ్రవరి 12న 225 జంటలకు కన్నుల విందుగా వివాహాలు జరిపిస్తున్నామన్నారు. వివాహాలు ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని 225 జంటలకు మంచి జరగాలనే అకాంక్షతో శుక్రవారం వాస్తు పూజలు నిర్వహించానమి ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి భార్య జమున తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్, ఎంజెఆర్ ట్రస్ట్ డైరెక్టర్ జక్కా రఘునందన్‌రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ కల్పన, వైస్ చైర్మన్ బాబురావుతో పాటు మహిళా కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ట్రస్ట్ డైరెక్టర్లు తదితరులు ఉన్నారు.



భూమి పూజ చేస్తున్న ఎంజెఆర్ ట్రస్ట్ అధినేత, ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి దంపతులు



వాసు పూజ చేస్తున్న ఎంజెఆర్ ట్రస్ట్ అధినేత, ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి దంపతులు

## జిల్లా అధికారులకు, పోలీసు శాఖకు ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమం విజయవంతం..

**వనపర్తి ప్రతినిధి,జనవరి 27 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు జిల్లా అధికారులు, పోలీసు శాఖ సిబ్బందికి ఏర్పాటు చేసిన ప్రత్యేక కంటి వెలుగు కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినట్లు జిల్లా అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ తెలిపారు. శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో అన్ని శాఖల సిబ్బందికి, పోలీసు సిబ్బందికి ఏర్పాటు చేసిన ప్రత్యేక కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం ద్వారా కంటి పరీక్షలు నిర్వహించిన వెంటనే కంటి అద్దాలను అందించడం జరిగిందని ఆయన తెలిపారు. ఐడీఓసీ సిబ్బందికి 193 మందికి, పోలీసు సిబ్బంది 123మందికి కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కంటి వెలుగు కార్యక్రమం విజయవంతం అయినట్లు సూచించారు. జిల్లా అదనపు ఎస్పీ షాకీర్ హుస్సేన్, డీఎస్పీ ఆనంద్ రెడ్డి, డీఎంహెచ్ఓ రవి శంకర్, ఏఓ సాయినాథ్, డీపీఆర్ఓ రషీద్, వైద్య శాఖ, పోలీసు శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేయించుకుంటున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

## 36వ సారి తెల్లరక్త కణాలు దానం చేసిన సహాయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు శివప్రసాద్ యాదవ్

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, జనవరి 27 ప్రభాతవార్త :** మద్దూరు గ్రామానికి చెందిన వెంకటయ్య అనే పేషంట్ అనారోగ్యంతో మహబూబ్‌నగర్‌లో గల ఎస్‌విఎస్ఆసుపత్రిలో చేరగా వైద్యంఏ రీక్షలు నిర్వహించిన అక్కడి వైద్యులు అతని లివర్ పాడైందని వెంటనే లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆపరేషన్ చేయాలని ఓ పాజిటివ్ తెల్ల రక్తకణాలు అవసరం అవుతుందని వైద్యులు నిర్ధారించారు. ఈవిషయం తెలుసుకున్న సహాయఫౌండేష్ వ్యవస్థాపక అధ్యక్షులు టంకరి శివప్రసాద్ యాదవ్ వెంటనే స్పందించి మహబూబ్‌నగర్‌కు అర్ధరాత్రి 1.15 గం.ల సమయంలో స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఓ+పాజిటివ్ తెల్లరక్త కణాలు దానం చేశారు. దీంతో కలిపి ఇప్పటికి ముప్పైఆరు (36) సార్లు రక్తదానం చేయడం జరిగిందని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు నరహరి, రవింద్రచారి తదితరులు పాల్గొన్నారు.



## కొత్త గ్రామ సేవా సమితి ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం

**వెల్దండ, జనవరి 27 ప్రభాతవార్త:** మండలంలోని కొత్త గ్రామంలో జంగమ్మ అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందడంతో కొత్త గ్రామ సేవా సమితి అధ్యక్షులు పొనుగోటి రవీందర్ రావు మృతురాలి కుటుంబ సభ్యులను శుక్రవారం పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలియజేసి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతురాలి కుటుంబానికి 25కిలోల బియ్యం, 9రకాల నిత్యావసర వస్తువులను అందించారు. మృతి చెందిన జంగమ్మ కుటుంబానికి కొత్త గ్రామ సేవా సమితి తరుపున అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో నాగరాజుగౌడ్, కొండలురావు, కదారి రవీందర్, భూత్కురి మల్లేష్, కొప్పు వెంకటయ్య, అర్జున్, నర్సింహ్మ, రామస్వామి, యాదయ్యతో పాటు తదితరులు ఉన్నారు.



## మున్సిపల్ కార్మికుడిని పరామర్శించిన మున్సిపల్ ఛైర్మన్

**కల్వకుర్తి, జనవరి 27 ప్రభాతవార్త:** కల్వకుర్తి మున్సిపాలిటిలో ట్రాక్టర్ డ్రైవర్‌గా విధులు నిర్వరిస్తున్న అర్జున్ రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లోని ఈఎస్ఐ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మున్సిపల్ ఛైర్మన్ ఎడ్మ సత్యం అర్జున్‌ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఎడ్మ కిష్టారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందించి కుటుంబానికి అండగా నిలుస్తానని భరోసానిచ్చారు. మున్సిపల్ ఛైర్మన్ వెంట నాయకులు శ్రీను తదితరులు ఉన్నారు.



## పాఠశాలకు మెక్‌సెట్ బహుకరణ

**వెల్దండ, జనవరి 27 ప్రభాతవార్త:** గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని కుందారం తాండ ప్రాథమిక పాఠశాలకు మైక్‌సెట్‌ను డాక్టర్ కొత్త మల్లేష్ శ్రీ సాయి ఆర్టికల్స్ ఆమనగల్లు వారి ఆధ్వర్యంలో అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు హెచ్‌ఎం నాగయ్య మెక్‌సెట్‌ను బహుకరించిన దాతలను శాలువాలు, పూలమాలలో ఘనంగా సన్మానించారు. కొత్త గణేష్ విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.శ్రీను, ఎబీసీ ప్రెసిడెంట్ రాం మోహన్, కార్యదర్శి ఆంజనేయులు, సర్పంచ్ కవిత సరేందర్, ఎస్ఎమ్‌సీ చైర్మన్ పత్యానాయక్, లాలుతాండ హెచ్ఎం నాగభూషణంతో పాటు తదితరులు ఉన్నారు.



## ప్రమాదంలో గాయపడిన ఫోటోగ్రాఫర్‌కు పరామర్శ...

-ఫోటో వీడియో గ్రాఫర్ల జిల్లా అధ్యక్షులు నేతాజీగౌడ్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 27 ప్రభాతవార్త:** కుటుంబ పోషణ కోసం వృత్తి అవసరమైన ప్రాణం చాలా ముఖ్యమైందనే విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలని ఫోటో వీడియో గ్రాఫర్ల జిల్లా అధ్యక్షులు నేతాజీగౌడ్ అన్నారు. ఫోటోగ్రాఫర్ ఖయ్యూం శుక్రవారం వృత్తి నిర్వహణలో భాగంగా కొల్లాపూర్ పట్టణంలోని వివాహ వేడుకకు బైక్‌పై వెళ్తుండగా ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షులు నేతాజీగౌడ్ ఖయ్యూం చికిత్స పొందుతున్న ఆసుపత్రికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. జిల్లా ఫోటో వీడియో గ్రాఫర్లకు జిల్లా, రాష్ట్ర సంఘం అండగా ఉంటుందని భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఫోటోగ్రాఫర్లు బెల్లం నరసింహ, శివ, శ్రీను, శంకర్, చారి తదితరులు ఉన్నారు.



## ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేందుకే కంటి వెలుగు..

**గద్వాల టౌన్, జనవరి 27 ప్రభాతవార్త :** 6వ వార్డు సెకండ్ రైల్వేగేట్ ఏరియాలో రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమం గురువారం ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కంటి వెలుగు 2వ విడత కార్యక్రమం ప్రారంభంచడం జరిగిందని తెలిపారు. చాలామంది పేదలు కంటి సమస్యలతో బాధపడుతున్నారని, అయితే ఆర్థికస్థోమత లేక కంటి పరీక్షలు చేయించుకోలేక, కంటి అద్దాలు సమకూర్చుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి కెసిఆర్ ముందస్తు ఆలోచనతో పేద ప్రజలకు కంటి సమస్యలు తొలగించేందుకు దేశంలో ఎక్కడలేని విధంగా కంటి వెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం, స్థానిక ఎమ్మెల్యే తమ అమూల్యమైన సమయం వెచ్చించి పేద ప్రజల ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించాలని కోరారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు శుక్రవారం నుండి మూడు రోజుల వరకు పెద్దచర్చి దగ్గర కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలని వార్డు కౌన్సిలర్ తెలిపారు.



## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

**నవాబ్‌పేట, జనవరి27ప్రభాతవార్త :** అమ్మాపూర్ గ్రామంలో టిఆర్ఎస్ నాయకుడు రాగుల పెంటయ్య అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో గురువారం మృతి చెందాడు. అమ్మాపూర్ గ్రామ సర్పంచ్, అంకురి సత్యం రూ.5వేల ఆర్థికసహాయం మృతుడి కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఉపసర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డి, బిఆర్ఎస్, టిఆర్ఎస్ సీనియర్‌నాయకులు వి.భీమయ్య, పి.అంతయ్య, బాలయ్య, చంద్రం, నవాబ్‌పేట టిఆర్ఎస్ సోషల్ మీడియా వై.యాదయ్య, టిఆర్ఎస్ విలేజ్ ప్రెసిడెంట్‌ఆంజనేయులు, సెక్రెటరీప్రసాద్, వార్డు మెంబర్ యాదయ్య, మల్కయ్య, టి.శ్రీను, ఎ.రామస్వామి, స్కూల్ ఛైర్మన్ కృష్ణయ్య, లక్ష్మయ్య, వీరస్వామి, భోగం వెంకటయ్య, రాములు, అంజయ్య, ప్రభు, నర్సింలు, టిఆర్ఎస్ గ్రామ ప్రజలు, పెద్దలు, యువకులు పాల్గొన్నారు.



## ఉచిత పశు వైద్యశిబిరం

**గండీడ్, జనవరి 27 ప్రభాతవార్త :** ప్రాథమిక పశువైద్య కేంద్రం బలుసురుగొండలో శుక్రవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ శిబిరాన్ని బలుసురుగండ సర్పంచ్ వనజ కరుణాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ శిబిరంలో 20 పశువులకు గర్భకోశ పరీక్షలు, 34 దూడలకు నట్టల నివారణ మందులు, 12 పశువులకు సాధారణ చికిత్సలు నిర్వహించడం జరిగింది. ఈ శిబిరంలో పశువైద్య సిబ్బంది డాక్టర్ రాంప్రసాద్, గండీడ్ మండల పశువైద్య అధికారి సమీర్, మంగమ్మ, మల్లయ్య, బామ్లునాయక్, గోపాల్, తిరుపతయ్య రైతులు పాల్గొన్నారు.



# నేడు పాలెం వెంకన్న రథోత్సవం (తేరు)..

**బిజినేపల్లి, జనవరి 27 ప్రభాతవార్త :** మార్గసిద్ధ సప్తమి, రథసప్తమి సందర్భంగా బిజినేపల్లి మండల పరిధిలోని పాలెం గ్రామంలో వెలిసిన శ్రీఅలివేలు మంగ సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఛైర్మన్ జున్నా శేఖర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకులు, వేద అర్చక బ్రాహ్మణులచే శనివారం ప్రాత:కాల పూజలు నిత్యారాధన ప్రబంద పారాయణం హోమం, బలిహరణం, నివేదన తీర్థ ప్రసాదాల గోష్టి ప్రత్యేక పూజలను వేదమంత్రోచ్చరణాల మధ్య నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆలయంలో మండలస్థాయి గోవింద నామాల పోటీలు, ఉదయం నుండి ప్రదోషకాలం వరకు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు పూజాసామాగ్రి తమ ఇంటినుండి తెచ్చుకోవాలన్నారు. ఆలయంలో వ్రతపీఠ, కంచారతులు, సత్యనారాయణస్వామి పటం అందజేయనున్నట్లు తెలిపారు. శ్రీరామ నాటకం మండలిచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. స్వామివారి పల్లకి సేవ సాయంత్రం ఆలయ మాడవీధుల గుండా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రథసప్తమి సందర్భంగా తేరును ఆలయం నుండి గ్రామంలోని రచ్చకట్ట వరకు భక్తి శ్రద్ధలతో, బాజా భజంత్రీల నడుమ, భక్తులతో కన్నుల పండువగా నిర్వహించినట్లు తెలిపారు.

మధ్యాహ్నం 12గం.ల నుండి రాత్రి 9 గం.ల వరకు పాల్గొన్న భక్తులందరికి నీటి వసతి, భోజన వసతి కల్పించినట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. భక్తులు స్వామివారికి నివేదించిన ప్రత్యేక తీర్థప్రసాదాలతో పాటు అన్నవసతిని వినియోగించుకోవాలని కోరారు.



గోవిందనామ పోటీల్లో కీర్తనలు ఆలపిస్తున్న భజనపరులు

**ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామివ్రతాలు**

**మండలస్థాయి గోవిందనామ నామపోటీలు**

**భక్తులకు మధ్యాహ్నం 12 గం.ల నుండి రాత్రి వరకు ఉచిత అన్న ప్రసాద పంపిణీ:ఆలయ ఛైర్మన్ జున్నాశేఖర్‌రెడ్డి**



పాలెం వెంకన్నస్వామి తేరు

# వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ వసతి గృహాల విద్యార్థులకు ఎవరెస్ట్ టాస్క్....

**-వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి అనిల్ ప్రకాష్**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 27 ప్రభాతవార్త:** విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం, సామాజిక గౌరవం పెంచే లక్ష్యంతో భువనగిరి జిల్లా వేదికగా నిర్వహిస్తున్న పర్వతారోహణ శిక్షణ ఎవరెస్ట్ టాస్క్‌లో పాల్గొనేందుకు నాగర్‌కర్నూల్ మరియు వనపర్తి జిల్లాలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ వసతి గృహాల విద్యార్థులు శుక్రవారం పర్వతారోహణ శిక్షణకు బయలుదేరినట్లు జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి అనిల్ ప్రకాష్ తెలిపారు. భువనగిరిలో నిర్వహిస్తున్న పర్వతారోహణ శిక్షణకు నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల నుంచి 100 మంది అమ్మాయిలు రెండు రోజుల పాటు శిక్షణలో పాల్గొంటారని ఆయన తెలిపారు. రాష్ట్రంలోని 26 జిల్లాల వసతి గృహాల నుంచి ఎంపిక చేసిన 2600 మంది బాలబాలికలకు 2 బ్యాచ్‌లుగా భువనగిరి రాక్ క్లైంబింగ్ స్కూల్ పర్యవేక్షణలో జిల్లాపై పర్వతారోహణలో శిక్షణ ఇస్తారన్నారు. మొదటి బ్యాచ్ అమ్మాయిలకు రెండు రోజుల శిక్షణ కొనసాగుతుందన్నారు. శిక్షణలో ప్రతిభ చూపిన విద్యార్థులు ఎవరెస్ట్ టాస్క్‌కు ఎంపికవుతారని అనిల్ ప్రకాష్ తెలిపారు. అమ్మాయిల శిక్షణ అనంతరం అబ్బాయిలకు శిక్షణ ఉంటుందన్నారు. గతంలో నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ వసతి గృహాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి సాధించారని, జిల్లా కలెక్టర్ విద్యార్థులను అభినందిస్తూ బెంగళూర్ విహారయాత్రకు సైతం పంపించారని ఆయన గుర్తు చేశారు. విద్యార్థులతో సహాయ సంక్షేమ శాఖ అధికారి శ్రీధర్, వసతి గృహాల వార్డెన్‌లు శిక్షణ కార్యక్రమానికి వెళ్లారు.



పర్వతారోహణ శిక్షణ కార్యక్రమానికి బయలుదేరి వెళ్తున్న విద్యార్థినులు

# కవిసింహ పోకూరి కాశీపతి జయంతి

**వేడుకల్లో పాల్గొన్న మున్సిపల్ ఛైర్మన్ : విద్వద్గద్వాల ఆస్థాన కవి కవిసింహ కాశీపతి**

**గద్వాల టౌన్, జనవరి 27 ప్రభాతవార్త :** గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ డిగ్రీ కళాశాల సెమినార్ హాల్‌లో జరిగిన గద్వాల పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కీ.శే. కవిసింహ పోకూరి కాశీపతి 130వ జయంతి వేడుకలు కవిసమ్మేళనం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ జంబు రామన్‌గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పోకూరి కాశీపతి చిత్రపటానికి పూజా కార్యక్రమాలు నిర్వహించి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ కేశవ్ మాట్లాడుతూ కవులు పద్య ము, గద్యము వచన కవితతో కవితలు అలరించాయి. గద్వాల ఆస్థాన కవి సింహం చాలా గొప్పవారని గద్వాల ఆస్థానంలో గొప్ప సన్మానాలు పొందారని అలాంటి వారి జయంతిలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నామని ఛైర్మన్ కేశవ్ అన్నారు. అనంతరం మున్సిపల్ ఛైర్మన్‌ను గ్రంథాలయ ఉపాధ్యక్షుడు పూలమాల శాలువాతో ఘనంగా సత్కరించడం జరిగింది. కార్యక్రమంలో కౌన్సిలర్ మహేష్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు బొట్టు సుధాకర్, వడ్డేకృష్ణ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీపతినాయుడు, తెలుగు అధ్యాపకులు శ్రీహరి, నాగభూషణం, వినోదచారి, అడ్వకేట్ పవన్‌కుమార్, రామ్మోహన్‌రావు, వేముల రవి, పులికూరి చంద్రప్రకాష్‌రావు, రామ్మోహన్‌రావు, కాశీపతి మనవడు పోకూర చెన్నకేశవ, మనోజ్‌కుమార్, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



కవులు, విద్యార్థినీ, విద్యార్థులు, అధికారులు



మున్సిపల్ ఛైర్మన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

## ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో శాశ్వత ప్రతిపాదికన ఉద్యోగులకు ధరఖాస్తుల స్వీకరణ

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 27 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో శాశ్వత ప్రతిపాదికన నిర్వహించనున్న మెడికల్ ట్రేడ్ ఓపెన్ రిక్రూట్మెంట్ ర్యాలీకి ఆసక్తి కలిగిన నిరుద్యోగులు హాజరు కావాలని వింగ్ కమాండర్ సజ్జశ్రీ చైతన్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టులు కేవలం దక్షిణ భారతదేశం రాష్ట్రాల నుంచి మాత్రమే రిక్రూట్మెంట్ నిర్వహిస్తున్నందున అభ్యర్థులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ పోస్టులు పురుషులకు మాత్రమే వర్తిస్తాయని, ఎంపికైన వారికి మంచి జీతంతో పాటు ఫించన్‌తో కూడిన శాశ్వత ఉద్యోగం ఉంటుందన్నారు. ఇంటర్మీడియట్‌లో బయాలజీ సబ్జెక్టుతో ఉత్తీర్ణులైన వారు, బీఎస్సీ నర్సింగ్ చేసిన వారు ఈ ఉద్యోగానికి అర్హులుగా పరిగణిస్తారన్నారు. బైపీసీతో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన వారు ఫిబ్రవరి 4వ తేదీన, బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన వారు ఫిబ్రవరి 7వ తేదీన ఎయిర్ ఫోర్స్ స్టేషన్ తంబారం చెన్నైలో నిర్వహించే ఓపెన్ రిక్రూట్మెంట్ ర్యాలీకి హాజరు కావాల్సి ఉంటుందన్నారు. తెలంగాణ నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు వాట్సాప్ నెంబరు 9345377868కు సంప్రదించాలన్నారు.

# విద్యార్థుల స్థాయికి అనుగుణంగా పరీక్ష పత్రాలను రూపొందించాలి...

**- జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎం.గోవిందరాజులు**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 27 ప్రభాతవార్త:** విద్యార్థుల సాయికి అనుగుణంగా పరీక్ష పత్రాలు రూపొందించాలని ఎస్సేటు పరీక్షా పత్రాల తయారీ కార్యశాలను ప్రారంభిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎం.గోవిందరాజులు సూచించారు. పరీక్ష పత్రాన్ని ఒకటి నుంచి 5వ తరగతి వరకు ఎల్ఎఫ్ఎల్ఎన్‌కు అనుగుణంగా రూపొందించాలని, 6 నుంచి 8వ తరగతుల వరకు ఎస్ఏ వన్ పేపర్ రూపంలోనే రూపొందించాలని 9వ తరగతి పరీక్ష పత్రాన్ని ఎస్‌సీఈఆర్టీ రూపొందించిన బ్లూప్రింట్ ఆధారంగా రూపొందించాలని సూచించారు. పరీక్షపత్ర తయారీలో సరళ భాష వాడాలని, వెయిటేజీకి అనుగుణంగా ప్రశ్నపత్రాలను తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి రాజశేఖర్‌రావు, జిల్లా నోడల్ అధికారి కుర్మయ్య, డీసీఈబీ సహ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పరీక్ష పత్రాలను పరిశీలిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎం.గోవిందరాజులు

# కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలించిన అధికారులు

**లట్టుపల్లిలో గర్భిణీలకు న్యూట్రిషన్ కిట్ల పంపిణీ**

**బిజినేపల్లి, జనవరి 27 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా వైద్యారోగ్య శాఖ ద్వారా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బిజినేపల్లి మండల పరిధిలోని లట్టుపల్లి రైతు వేదికలోని కంటి వెలుగు శిబిరాన్ని జిల్లా క్వాలిటి కంట్రోల్ ఆఫీసర్ డా. డి. పవన్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రోగికి కంటి వెలుగు శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి అందులో ప్రత్యేక అవసరాలు ఉన్న వారిని గుర్తించి చికిత్సలు అందించే విధంగా సూచించాలన్నారు. దగ్గర చూపుల్లో దృష్టి లోపం ఉన్నవారికి అందుబాటులోని సరైన అద్దాలను వెంటనే అందజేయాలని తెలిపారు. దూరపుచూపు లోపం ఉన్నవారిని గుర్తించి అంతర్జాలంలో కంటి అద్దాలకు వివరాలు నమోదు చేసి పంపాలని సూచించారు. రోగులకు శిబిరాలలో మెరుగైన కంటి సేవలు అందించాలని అన్నారు. అనంతరం లట్టుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా భూగర్భజల మండల ప్రత్యేక అధికారి రమాదేవి గర్భిణీలకు న్యూట్రిషన్ కిట్ల పంపిణీ చేశారు. గర్భస్థ సమయంలో ప్రభుత్వం అందించిన న్యూట్రిషన్ కిట్లను తప్పనిసరిగా వినియోగించుకుని ఆరోగ్యం మెరుగుపరచుకోవాలని, రక్తహీనత నివారణకు, పౌష్టికాహార లోప నివారణకు కిట్లు తోడ్పాటు అవుతాయన్నారు. గర్భిణీలు ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు జరుపుకోవాలని లట్టుపల్లి వైద్యాధికారి డా. బి. శ్రీకాంత్ వారికి సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డా. తేజస్విని, ఆరోగ్య విస్తీర్ణాధికారి పోల శ్రీధర్, పర్యవేక్షకురాలు సరళ, ఆరోగ్య కార్యకర్తలు టి.యాదగిరి, జ్యోతి, జకియాబేగం, సుమిత్ర, దివ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



న్యూట్రిషన్ కిట్లను అందజేస్తున్న వైద్యాధికారులు

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి అక్కడికక్కడే మృతి

**మూసపేట, జనవరి 27 ప్రభాతవార్త :** మండల పరిధిలోని వేముల స్టేజీ సమీపాన శుక్రవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని అంబటి రాజు (28) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మూసపేట ఎస్సై నరేష్ కథనం ప్రకారం నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం, జప్మత్‌పుర గ్రామానికి చెందిన అంబటి రాజు సంకల్‌మద్ది ఎస్సీ కాలనీకి చెందిన మాలచెన్నయ్య కూతురును నాలుగు సంవత్సరాల క్రితం వివాహం చేసుకుని సంకలమద్ది గ్రామంలో ఉంటూ కూలీపని చేసుకుంటూ ఉండేవాడని గురువారం తెల్లవారుజామున రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందినట్లు మూసపేట ఎస్సై నరేష్ తెలిపారు. మృతి చెందిన రాజుకు ఒక కూతురు, ఒక కొడుకు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించామని ఎస్సై తెలిపారు.



## ఉత్తమ యువజన సంస్థగా స్వామి వివేకానంద సేవా బృందంకు అవార్డు...

**కల్వకుర్తి, జనవరి 27 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణానికి చెందిన స్వామి వివేకానంద సేవా బృందంకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో గత 10 సంవత్సరాల నుంచి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజంలో చైతన్యం చేపడుతున్నందుకు భారత ప్రభుత్వం యువజన క్రీడా సర్వీసుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని నెహ్రూ యువ కేంద్రం మహబూబ్‌నగర్ వారు ప్రతి సంవత్సరం వారి సేవలకు గుర్తింపుగా అందించే జిల్లా స్థాయి ఉత్తమ యువజన సంఘ సంస్థ అవార్డు మరియు రూ.25వేల రికార్డుకు ఎంపికైనట్లు స్వామి వివేకానంద సేవా బృందం అధ్యక్షులు శివకుమార్ శుక్రవారం తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఈ అవార్డు రావడం చాలా సంతోషకరంగా ఉందని, స్వామి వివేకానంద చెప్పిన మాటలను ఆదర్శంగా తీసుకొని రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ అవార్డు ఉమ్మడి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందుకున్నట్లు జిల్లా యువజన అధికారి పేర్కొన్నారు.



## వక్తృత పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మోదీ రాసిన పుస్తక ప్రదానం..

**వనపర్తి టౌన్, జనవరి 27 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల పాఠశాలలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పరీక్ష పే చర్చ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వక్తృత పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు స్వయాన మోదీ రాసిన పుస్తకాన్ని బహుమతి ని ప్రధానోపాధ్యాయులు తారాబాయి, గాయిత్రి, శ్రీనివాస్ గౌడ్, విష్ణువర్ధన్ రెడ్డి, సూగూరు రాము, రాయన్నల చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేయడం జరిగింది.

## వసంత పంచమి సందర్భంగా బీజేవైఎం ఆధ్వర్యంలో చిన్నారులకు పలకల వితరణ

**వనపర్తి టౌన్, జనవరి 27 ప్రభాతవార్త:** భారతీయ యువమోర్చ ఆధ్వర్యంలో వసంత పంచమి ని పురస్కరించుకొని స్థానిక 20వ వార్డు గాంధీనగర్‌లో బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రాజశేఖర్ ఆధ్వర్యంలో స్థానిక అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు పలకలు, బుక్స్, పెన్సిల్, చార్ట్స్ పంపిణీ చేసి చిన్నారులకు సరస్వతి మాత ఆశీర్వాదాలు ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ జ్యోతి, ఓబీసీ పట్టణ సోషల్ మీడియా కన్వీనర్ రవి సాగర్, బీజేపీ నాయకులు శివ, అంజి పాల్గొన్నారు.



## 28న క్రిష్టంపల్లిలో వాల్మీకి విగ్రహావిష్కరణ..

**అమరచింత, జనవరి 27 ప్రభాతవార్త:** రామాయణ సృష్టికర్త శ్రీ వాల్మీకి మహర్షి విగ్రహ ఆవిష్కరణ ఈనెల 28న అమరచింత మండల పరిధిలోని నూతన వాల్మీకివిగ్రహం ఏర్పాటు చేస్తున్నామని వాల్మీకి సంఘం నాయకులు మేస్త్రీ కురుమన్న, బి.రాజు, ముకుంద, బి.సుధాకర్ లు తెలిపారు. ఈ విగ్రహావిష్కరణ కు ముఖ్య అతిథిగా మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి, వాల్మీకి సంఘం రాష్ట్ర నాయకులు గట్టు తిమ్మప్ప హాజరవుతున్నారని వారు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మండలంలోని వాల్మీకి సోదరులు భారీగా తరలిరావాలని వారు కోరారు.

## మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం..

**పెబ్బేరు, జనవరి 27 ప్రభాతవార్త:** తమతో పాటు చదువుకున్న బాల్య స్నేహితుడి కుటుంబ సభ్యులకు 2008-09 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు శుక్రవారం రూ.31వేల సాయం అందజేశారు. పెబ్బేరు మండలం రంగాపురం గ్రామానికి చెందిన బెర్కి శివ రంగాపురం జడ్పీ పాఠశాలలో చదువుకున్నాడు. బెర్కి శివ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. అతడి కుటుంబం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉండడంతో స్నేహితుడి భార్య మయూరికి రూ.31వేల సాయం అందజేశారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ తమతో పాటు చదివిన స్నేహితులకు ఏ ఇబ్బందులు వచ్చిన తాము ఆదుకుంటామని తెలిపారు. గతంలో తోటి మిత్రులకు చాలమందికి ఆర్థిక సాయం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నరేష్, యాదగిరి, భాస్కర్, రమేష్, వేణు, శేఖర్, నరసింహ, దశరథ తదితరులు పాల్గొన్నారు.



## అంజనగిరి రైతుల ఇనాం భూములకు పట్టాలు ఇవ్వాలి..

**బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు చెన్నరాములు ముదిరాజ్.**

**వనపర్తి టౌన్, జనవరి 27 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా మండలంలోని అంజనగిరి గ్రామ రైతులు గత 200 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న ఇనాం భూములకు వెంటనే పట్టాలు ఇవ్వాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు చెన్నరాములు ముదిరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం అంజనగిరి రైతులతో పాటు ఇనాం నిరుపేద రైతులకు వెంటనే రక్షిత కౌల్దారి చట్టం ప్రకారం ప్రభుత్వం వెంటనే పూర్తి స్థాయిలో వ్యక్తిగత పట్టాలు ఇచ్చి రైతుబంధు వర్తింపజేసి, రైతు భీమా వర్తింపజేసి, సిబ్సిడీ ఎరువులు ఇవ్వాలని చెన్నరాములు ముదిరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ సీనియర్ కాటిక కురమయ్య, గోపాల్‌పేట మండల ప్రధాన కార్యదర్శి మండ్ల మైబూస్ వాల్మీకి, వనపర్తి మండల నాయకులు కత్తెపల్లి బండలయ్య, కొమారి నాగేంద్ర, బీవీఎఫ్ అసెంబ్లీ కో కన్వీనర్ సుభాష్‌చంద్ర, నల్లపోతుల పెద్ద మణ్యం, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



**బిజినేపల్లి,జనవరి 27 ప్రభాతవార్త :** మండలంలోని పాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని శుక్రవారం విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులైన విద్యార్థులు మాట్లాడుతూ ఒకరోజు ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించడం వల్ల ఉపాధ్యాయ వృత్తి ఎంతో బాధ్యతాయుతమైనదని గ్రహించినట్లు తెలిపారు. విద్యార్థులకు పాఠ్యాంశం బోధనకు ఉపాధ్యాయుడిగా ఎంతో కష్టపడాల్సి ఉంటుందని వివరించారు. తరగతి గదిలో విద్యార్థి ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తుంటే ఎంపిపి శ్రీనివాస్‌గౌడ్ విద్యాబోధనను పరిశీలించి అభినందించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ భాస్కర్‌రెడ్డి, పాఠశాల ఇంఛార్జి ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, చంద్రమోహన్‌రెడ్డి, సుదర్శన్, ఖాజా, రాఘవేందర్, కలెక్టర్‌గా సందీప్‌రెడ్డి, ఆర్జెడిగా సంధ్య, డీఈఓగా వర్ష, విద్యాశాఖ మంత్రిగా స్పందన, ప్రధానోపాధ్యాయుడుగా సాయికుమార్‌లు వ్యవహరించారు.

## వధూవరులను ఆశీర్వదించిన మాజీమంత్రి చిన్నారెడ్డి...



**జల్లాఘణపురం,జనవరి 27 ప్రభాతవార్త:** మండల పరిధిలోరి రుక్కపల్లి గ్రామంలో నాగన్న కుమారుడు నూతన వధూవరులు మహేష్ మౌనిక వివాహ వేడుకకి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి డా.చిన్నారెడ్డి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్ కే సాధ్యమని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విపరీతంగా నిత్యవసర ధరలు పెంచి ప్రజల జీవితాలతో ఆటలాడుకుంటున్నాయని అన్నారు. ప్రజా క్షేత్రంలో టీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు బంగపాటు తప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్, పీసీసీ డెలిగేట్ కిరణ్ కుమార్, సోలీపూర్ బాలవ్రెడ్డి, పెద్దమందడి అధ్యక్షులు పెంటన్న యాదవ్, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి నరసింహ, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం కేసీఆర్ రైతులకు ఇచ్చిన హామీని అమలు చేయాలి..

**వనపర్తి జిల్లా రైతు సంఘం జిల్లా కార్యదర్శి పరమేశ్వర చారి**



**వనపర్తి టౌన్,జనవరి 27 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం ఎలక్షన్ ల ముందు రైతులకు లక్ష రూపాయల వరకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పడితే రుణమాఫీ చేస్తాననిచెప్పి నాలుగు సంవత్సరాలు అయినా నేటి వరకు అమలు చేయకపోవడం అదే విధంగా ఎలక్షన్‌ల ముందు రైతును రాజుగా చేస్తానని చెప్పారు కానీ నేటి వరకు రైతులకు రుణమాఫీ కాక రైతు ప్రైవేటు వ్యాపారస్తుల దగ్గర అధిక వడ్డీలకు అప్పులు తీసుకువచ్చి పెట్టుబడులు పెట్టి అప్పుల పాలవతున్నారు వెంటనే రుణమాఫి చేయాలని వనపర్తి జిల్లా రైతు సంఘం జిల్లా కార్యదర్శి పరమేశ్వర చారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని మూలిగే నక్కపై తాటినఆయ పడ్డట్టుగా ప్రైవేటు వ్యాపారుల దగ్గర అధిక వడ్డీలు కట్టలేక పంటలకు పెట్టుబడి గిట్టుబాటు ధర రాక రైతు పరిస్థితి ఆగమ్య గోచరంగా మారిందని ఇప్పటికైనా ఫిబ్రవరి 3వ తేదీ వరకు జరిగే అసెంబ్లీ సమావేశాల్లో రైతుల పరిస్థితి దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించాలని ఆయన కోరారు.

## అంగన్వాడీ టీచర్లకు రూ.26వేల కనీసవేతనం చెల్లించాలి..



**వనపర్తి టౌన్,జనవరి27 ప్రభాతవార్త:** వనపర్తి ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ముందు తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. అంగన్వాడీ టీచర్ల ను హెల్పర్లను స్కీం వర్కర్లుగా ఉంటే ఇతర కార్మికులను కార్మికులుగా గుర్తించాలని ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ 54 సమావేశం తీర్మానించిందని, ఆ తీ ర్మానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేసింది. నాలుగు లేబర్ కోడ్ లు రద్దు చేయాలని అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని రిట్మెంట్ బెనిఫిట్ రూ.5లక్షలు, హెల్పర్స్‌కు రూ.3లక్షలు ఇవ్వాలని చివరి జీవితంలో సగం పెన్షన్ ఇవ్వాలని తదితర డిమాండ్ లతో కూడిన వినతిపత్రాన్ని సీడీపీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కు అందజేయడం జరిగింది. ఈ ధర్నా కార్యక్రమంలో తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పుట్ట ఆంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షులు బి.కవిత, వనపర్తి జిల్లా కార్యదర్శి నారాయణ, వనపర్తి ప్రాజెక్టు అధ్యక్షురాలు జ్యోతి, ప్రాజెక్టు కార్యదర్శి సుమతి, సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు బొబ్బిలి నిక్సర్, జిల్లా కమిటీ సభ్యులు నందిమల్ల రాములు, యూనియన్ నాయకులు భాగ్యమ్మ అరుణ, విజయ, సునీత, వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

## విజయవంతంగా పోలీసుల కంటి వెలుగు..



**వనపర్తి క్రైమ్,జనవరి 27 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా వైద్యాధికారులు ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారులకు, సిబ్బందికి వారి కుటుంబ సభ్యులకు ప్రత్యేకంగా కంటి పరీక్షలు చేయించుకున్నారు. పోలీసుల కొరకు ఏర్పాటు చేసిన ప్రత్యేక కంటి వెలుగు కార్యక్రమంలో వనపర్తి అదనపు ఎస్పీ షాకీర్ హుస్సేన్, డీఎస్పీ ఆనంద్ రెడ్డి పోలీసు అధికారులు సిబ్బందితో కలిసి కంటి పరీక్షలు చేయించుకున్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరంలో వనపర్తి పట్టణ పోలీస్ స్టేషన్, సాయుధ బలగాల అధికారులు, సిబ్బంది పరీక్షలు చేయించుకున్నారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ ల వారి పరిధిలోని ఆరోగ్య కేంద్రాలలో పోలీసు అధికారులు, సిబ్బంది పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డా.రవిశంకర్, కంటి వెలుగు ప్రోగ్రాం అధికారి డా.సాయినాథ్ రెడ్డి, రిజర్వ్ ఇన్స్పెక్టర్ జగన్, రూరల్ 2వ ఎస్ఐ రామరాజు, పట్టణ 2వ ఎస్ఐ శివకుమార్, జిల్లాలోని పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## మండలంలో వివిధ పనులను పరిశీలించిన స్పెషల్ ఆఫీసర్..



**వీపనగండ్ల,జనవరి 27 ప్రభాతవార్త:** మండలంలోని సంగినేనిపల్లి గ్రామంలో మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులను స్పెషల్ ఆఫీసర్ సుధాకర్ రెడ్డి, సర్పంచ్ మౌలాలి, ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో పరిశీలించి పండ్లను ఐరన్ డోర్స్ అలంకరణ పనులను త్వరగా పూర్తి చేయాలని స్పెషల్ ఆఫీసర్ సూచించడం జరిగింది. తరువాత నర్సరీ ని పరిశీలించి జర్మనేషన్ 95% వచ్చినందుకు క్రమం తప్పకుండా నీళ్ల పట్టాలని సూచించారు. ఆ తరువాత గోవర్ధనగిరి గ్రామంలో కంటి వెలుగు ప్రోగ్రాం చివరి రోజు ఎక్కువ సంఖ్యలోఓ ప్రజలు హాజరు అయ్యేలా చేయాలని సర్పంచ్, కార్యదర్శి రాజును కోరారు. ఈ కార్యక్రమంలో సంగినేనిపల్లిలో సర్పంచ్ మౌలాలి, కార్యదర్శి శ్యామ్ ఫీల్డ్ అసిస్టెంట్ గంగమ్మ, మౌలాలి ప్రధానోపాధ్యాయులు, గోవర్ధనగిరి సర్పంచ్ చంద్రకళ సురేష్ రెడ్డి, కార్యదర్శి రాజు, డా.వంశీకృష్ణ, సీసీ వీరయ్య, బాలకృష్ణ, ఎఫ్ఏ పాల్గొన్నారు.

## ఎంపిడిఓ, సీనియర్ అసిస్టెంట్లను సన్మానించిన ఎంపిపి



**ధరూర్,జనవరి 27 ప్రభాతవార్త :** ధరూర్ మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓను సీనియర్ అసిస్టెంట్‌లను ఎంపిపి నజీమున్నిసాబేగం 74వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా కలెక్టర్ చేతులమీదుగా జిల్లా స్థాయిలో ఉత్తమ సేవలందించినందుకు ప్రశంసా పత్రాలు అందుకున్న ధరూర్ మండల అభివృద్ధి అధికారి అబ్దుల్ జబ్బార్, మండల సీనియర్ అసిస్టెంట్ ఆనంద్‌లకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఎంపిపి నజీమున్నిసాబేగం సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిటిసి దౌలన్న, మండల బిఆర్ఎస్ నాయకులు జాకీర్, రాజారెడ్డి, వెంకటేష్ నాయుడు, బిసిసెల్ కన్వీనర్ శ్రీను, మండల మైనార్టీ అధ్యక్షులు ఉమర్, రాముడు,సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు తనవంతు పూర్తి సహాయ సహకారం..

**విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేసిన డిసిసిబి ఛైర్మన్ మనోహర్‌రెడ్డి**



పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న దృశ్యం

**గండీడ్,జనవరి 27 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని గ్రామీణ ప్రాంతాలలోని నిరుపేద విద్యార్థులకు తనవంతు పూర్తి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డిసిసిబి ఛైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని గండీడ్ సల్కర్‌పేట, బల్సురుగొండ, వెన్నచెడ్, చిన్నవార్వాల్ తదితర ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఎంఆర్ ఫౌండేషన్ ద్వారా అన్ని ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదవుతున్న పేద విద్యార్థులకు ఉత్తీర్ణత శాతం పెంచేందుకు పేద పిల్లలకు స్టడీ మెటీరియల్‌ను అందిస్తున్నానని తెలిపారు. విద్యాభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని తెలిపారు. విద్యార్థులు బాగా చదువుకుని పదవ తరగతిలో మంచి ఉత్తమ ఫలితాలు తీసుకురావాలని సూచించారు. ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థానంలో స్థిరపడాలని పేర్కొన్నారు. తల్లిదండ్రులకు,పాఠశాలకు మంచి గుర్తింపు తెచ్చి మంచి వివిధ ఉన్నతస్థాయి రంగాలలో రాణించాలన్నారు. చదువు చాలా ముఖ్యమన్నారు. అందుకు ఎన్ని కష్టాలు వచ్చినా చదవును ఆపవద్దని వివరించారు. మీకు ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తేవాలని అన్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ ఛైర్మన్ కమతం శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు చంద్రకళ, నరేష్, వనజ, జితెందర్‌రెడ్డి, ఎంపిటిసి బాలయ్య,సీనియర్ నాయకులు కొమురె లక్ష్మయ్య, సుదర్శన్‌రావు, కుల్కచర్ల మొగులయ్య, కుల్కచర్ల ఎంపిటిసి ఫోరం అధ్యక్షుడు రామ్‌లాల్, రైతుసమన్వయ సమితి అధ్యక్షుడు గిరిధర్‌రెడ్డి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అన్నసాగర్ మాజీ సర్పంచ్‌ని పరామర్శించిన బీసీ సమాజ్...

**బీసీ మహిళా సర్పంచ్ ని వేధింపులకు గురిచేసి సస్పెండ్ చేయడం దురదృష్టకరం...**

**తెరాస ప్రభుత్వం సర్పంచుల ఉసురు తీసుకుంటుంది..**



బీసీ మహిళా మాజీ సర్పంచ్ నీలిమను పరామర్శిస్తున్న బీసీ సమాజ్ పార్టీ నాయకులు

**భూత్పూర్,జనవరి 27 ప్రభాతవార్త:** అన్నసాగర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కరెంట్ నీలిమని బీసీ సమాజ్ జాతీయ అధ్యక్షులు సంగెం సూర్యారావు, బీజేపీ రాష్ట్రన నాయకులు దేవరకద్ర బాలన్న తో కలిసి బీసీ సమాజ్ జాతీయ ఉపాధ్యక్షులు నాగపరిమళ పరామర్శించారు. ఈ సందర్భంగా నీలిమ మాట్లాడుతూ గత మూడున్నర సంవత్సరాల నుండి ఎమ్మెల్యే అనేక వేదింపులకు గురి చేస్తున్న ఉపసర్పంచ్ ని అడ్డంపెట్టుకొని పని చేసిన బిల్లులు రానివ్వకుండా తప్పని పరిసింథతుల్లో పార్టీ మారడం జరిగిందని తెలిపారు. దీనికి గాను కుట్ర పూరితంగా మా వారిని జైల్లో పెట్టించడం కాకుండా కావాలని నన్ను కుట్ర పూరితంగా ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి సస్పెండ్ చేయించారని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా కరెంటు నీలి వారి కుటుంబ సభ్యులను బీసీ సమాజ్ జాతీయ ఉపాధ్యక్షురాలు నాగపరిమళ పరామర్శించి మాట్లాడుతూ బీసీ మహిళా ఉద్దేశంతో ఎమ్మెల్యే అనేక విధాలుగా కష్టాలు పెట్టడం దురదృష్టకరమని తెలుపుతూ వారికి బీసీ సమాజ్ అన్ని రకాలుగా అద్దుకుంటూ న్యాయపరమైన పోరాటం చేస్తామని హామీ ఇచ్చారు. తెరాస ప్రభుత్వం ఏర్పడ్డ తరువాత ఇంకిత జ్ఞానం లేని కేసీఆర్ ప్రభుత్వం, వారి ఎమ్మెల్యేలు విచ్చలవిడిగా దౌర్జన్యం చేస్తున్నారన బీజేపీ రాష్ట్ర నాయకులు దేవరకద్ర బాలన్న ఆరోపించారు. ఎమ్మెల్యే స్వగ్రామంలో బీసీ మహిళా సర్పంచ్‌ని వేధించడం దిగజారుడు తనానికి నిదర్శనం అని తెలుపుతూ తెరాస ప్రభుత్వం బాదలు తొలగిపోయే విధంగా పథకాలు విధివిధానాలు ఉంటాయని సూచించారు.

## కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలందరు ఉపయోగించుకోవాలి..



కంటి పరీక్షలను పరిశీలిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మెన్ వాకిటి శ్రీధర్

**వనపర్తి టౌన్,జనవరి 27 ప్రభాతవార్త:**శ్రీనివాసపురం 9వ వార్డులో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించిన వనపర్తి మున్సిపల్ వైస్ చైర్మెన్ వాకిటి శ్రీధర్, స్థానిక కౌన్సిలర్ విభూది నారాయణ, రైతు సంఘం అధ్యక్షుడు నరసింహ తిరుమల మహేష్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వాకిటి శ్రీధర్ మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలందరు వినియోగించుకోవాలని చూపులు మందగించకుండా జాగ్రత్త పడాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ముందు చూపుతో అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన కంటి వెలుగు కార్యక్రమంలో వేలాదిమంది యువకుల నుండి మొదలుకొని ముసలివారి వరకు పరీక్షలు చేయించుకున్నారని పరీక్షలు చేయించుకున్న ప్రతి వారిలో ఏదో ఒక చిన్న లోపం కనపడుతుందని దీన్ని బట్టి ముఖ్యమంత్రి దృష్టి ఎంత గొప్పదో అర్థమవుతుందని అన్నారు. ఇంత గొప్ప కార్యక్రమాన్ని ప్రారంభించి తెలంగాణ రాష్ట్ర ప్రజలకు కంటి వెలుగు అందిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి కి వనపర్తి మున్సిపల్ వైస్ చైర్మెన్ వాకర్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ విభూది నారాయణ, రైతు సంఘం మండల అధ్యక్షుడు దేవర్ల నరసింహ, టీఆర్ఎస్ నాయకులు తిరుమల మహేష్ బాబు నాయక్ ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## మూడావత్ లోక్యా నాయక్ కు నివాళి అర్పించిన మాజీ మంత్రి చిన్నారెడ్డి..



పార్థివదేహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న మాజీ మంత్రి చిన్నారెడ్డి

**పెబ్బేరు,జనవరి 27 ప్రభాతవార్త:** మండల పరిధిలోని చిన్న గుమ్మడం తాండాకు చెందిన మూడావత్ లోక్యా నాయక్ అనారోగ్యంతో మరణించిన విషయం తెలుసుకున్న మాజీ మంత్రి చిన్నారెడ్డి వారి ఇంటికి వెళ్లి లౌక్య నాయక్ భౌతికదేహంపై పూలమాల వేసి నివాళి అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించడం జరిగింది. పెబ్బేరు పట్టణ కేంద్రంలో 12వ వార్డులో నేష భాస్కర్ కోడలు గుండెపోటుతో మరణించిన విషయం తెలుసుకున్న ప్రియతమ నేత డా.జి.చిన్నారెడ్డి వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి భౌతిక దేహం పై పూలమాల వేసి నావాళి అర్పించారు. కుటుంబ సభ్యులు ఎవరైనా మరణిస్తే ఆ లోటు ఎవరు తీర్చలేరని భగవంతుడు వారి కుటుంబ సభ్యులకు ధైర్యం ఇవ్వాలని కోరారు. ఈకార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రంప్రసాద్ యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, పెబ్బేరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎద్దుల విజయవర్దన్ రెడ్డి, టౌన్ ప్రెసిడెంట్ కారపాకుల వెంకటరాములు, టి.సత్యనారాయణ రణధీర్ రెడ్డి, బుర్రమోని రాములు యాదవ్, మైనార్టీ ప్రెసిడెంట్ జాంగీర్, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు రోహిత్, దిలీప్ యాదవ్, రాజు నాయక్, మల్లయ్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఐఎఫ్‌టీయు ఆధ్వర్యంలో ముందు ధర్నా జయప్రదం చేయండి..



భవన నిర్మాణ కార్మికుల పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

**అమరచింత,జనవరి 27 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రగతిశీల భవ నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో అమరచింత మండల మస్తీపూర్ గ్రామంలో తెలంగాణ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాల సాధనకై ఫిబ్రవరి 1న వనపర్తి కలెక్టర్ ఆఫీస్ ముందు జరుగు ధర్నాను జయప్రదం చేయాలని పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈకార్యక్రమాన్ని ఉద్దేశించి తెలంగాణ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘంరాష్ట్ర సహాయ కార్యదర్శి సి.రాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించినట్లుగా భవన నిర్మాణ కార్మికులందరికి ఉచితంగా మోటార్ వెహికల్ ఇవ్వాలని, ప్రమాద మరణానికి రూ.10లక్షలు ఇవ్వాలని, శాశ్వతంగా వైకల్యానికి రూ.10లక్షలు ఇవ్వాలని 60 సంవత్సరాలు నిండిన కార్మికులకి రూ.6వేలు పెన్షన్ సౌకర్యం కల్పించాలని భవన నిర్మాణరంగం కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్ మంజూరు చేయాలని ఆయన తెలిపారు. ఇల్లు లేని భవన నిర్మాణ కార్మికులకు డబుల్ బెడ్ రూం మంజూరు చేయాలని తదితర డిమాండ్ లతో ఫిబ్రవరి 1వ తేదీన వనపర్తి కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. కావున జిల్లాలో ఉన్న భవన నిర్మాణ కార్మికులందరు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల భవన , ఇతర కురుమన్న, ఉపాధ్యక్షులు దేవన్న, కోశాధికారి కె.రవి, మేస్త్రీలు రాజు, శేఖర్, బుచ్చన్న, కె.మన్యం, కె.రాజు, ఎలక్ట్రికల్ వర్కర్ మహేష్, టి.అశోక్, పెద్దబాబు, గాలెన్న తదితరులు పాల్గొన్నారు.

## కంటి వెలుగు శిబిరాల పరిశీలన



కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఓ



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపిడిఓ

**మల్దకల్,జనవరి 27 ప్రభాతవార్త :** మల్దకల్ మండలంలోని పెద్దపల్లి గ్రామ పంచాయతీ పల్లె ప్రకృతి వనాన్ని ఎంపిడిఓ కృష్ణయ్య శుక్రవారం పరిశీలించారు. పాల్వాయి గ్రామంలో ఈనెల 30వ తేదీ నుండి సబ్ సెంటర్‌లో ఉచిత కంటి శిబిరం నిర్వహించడుతుంది. అన్ని వసతులు విద్యుత్, నీటి సౌకర్యం, టాయిలెట్స్, కుర్చీలు, టేబుళ్లు, షామియానా ఉండేలా చూడాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేవించారు. అక్కడ గ్రామ పంచాయతీలో గ్రామ పంచాయతీకి సంబంధించిన రికార్డులు పరిశీలించారు. అనంరం అక్కడ ఉన్న నర్సరీని కూడా పరిశీలించారు. త్వరలో మొలకలు వచ్చే విధంగా షెడ్‌నెట్ ఏర్పాటు చేయాలని ఎందుకంటే ఎండలు విపరీతంగా ఉన్నాయని మొలకలు తొందరగా మొలకెత్తడానికి నీడ అవసరమని చెప్పారు. అదేవిధంగా ఉదయం, సాయంత్రం పూట మాత్రమే నీటిని పట్టాలని చెప్పారు. నీలిపల్లిలో జరుగుతున్న కంటి వెలుగు ఉచిత శిబిరాన్ని పరిశీలించారు. అక్కడ ఉన్న డాక్టర్‌లకు ఎఎన్ఎం, ఆశాలకు పంచాయతీ కార్యదర్శులకు ఇచ్చిన టార్గెట్ పూర్తయ్యేలా చూడాలని చెప్పారు.

## కౌన్సిలర్ బ్రహ్మంని సన్మానించి డీసీసీ ప్రధాన కార్యదర్శి మొగిలి సత్యారెడ్డి..



**వనపర్తిటౌన్,జనవరి 27 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ బ్రహ్మం నూతన జ్యూవెల్లర్ షాప్ ను ప్రారంభించడం జరిగింది. శుక్రవారం డీసీసీ కార్యదర్శి మొగిలి సత్యారెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షులు కోట్ల రవి బ్రహ్మం ను బంగారు షాపును సందర్శించి శాలువాతో ఘనంగా సన్మానించడం జరిగింది. వారి వ్యాపార రిత్యా ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆదేవుడిని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ బండారు కృష్ణ, సందీప్, వనపర్తి యువజన కాంగ్రెస్ అధ్యక్షులు రాగి అక్షయ్, సీనియర్ నాయకులు జానపేట నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## మత సామరస్యాలకు ప్రతీకగా సైదుల్ దర్గా ఉత్సవాలు



**వెల్దండ, జనవరి 27 ప్రభాతవార్త:**మత సామరస్యాలకు ప్రతీకగా సైదుల్ దర్గా ఉత్సవాలు నిలుస్తాయని గ్రామ సర్పంచ్ దార్లకుమార్ అన్నారు. వెల్దండ మండల పరిధిలోని భైరాపూర్ గ్రామంలో వెలిసిన సైదులు దర్గా ఉత్సవాలు ప్రతి యేడాది కులమతాలకతీతంగా భక్తులు దర్గాలో ప్రత్యేక ఫాతిహాలో పాల్గొంటారు. ఈ సంధ్బంగా గ్రామ సర్పంచ్ దార్లకుమార్, ఉప సర్పంచ్ రమేష్‌గౌడ్‌లు దర్గాలో ప్రత్యేక ఫాతిహా కార్యక్రమంలో పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు. గ్రామంలో వెలిసిన సైదులు దర్గా గంధోత్సవం, ఉత్సవాలను గ్రామస్తులతో పాటు చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరవుతారని సర్పంచ్ పేర్కొన్నారు. ఉత్సవాలను ప్రతి యేడాది ఘనంగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు దర్గమ్మ, అల్లాజీ, సైదులు తదితరులు ఉన్నారు.

## అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని నిరసన..



**కల్వకుర్తి,జనవరి27 ప్రభాతవార్త:**అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం కల్వకుర్తి పట్టణంలోని ప్రాజెక్టు అధికారి కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు మాట్లాడుతూ ఫిబ్రవరి 3 నుంచి నిర్వహించే అసెంబ్లీ సమావేశాల్లో అంగన్‌వాడీ ఉద్యోగులకు బడ్జెట్‌లో కేటాయింపులు పెంచే విధంగా కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఐటీయూ నాయకులు తదితరులు ఉన్నారు.

## వివాహ వేడుకకు హాజరైన బిఆర్ఎస్ నాయకులు ఆర్.కిశోర్



**అలంపూర్,జనవరి 27 ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజవర్గంలోని అయిజ మండలం కొత్తపల్లిలో జరిగిన బిఆర్ఎస్ యువ నాయకులు వివాహానికి హాజరై నూతన వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఏలియాజర్, ఆనంద్, వెంకట్రాములు, ఆనంద్, రాజ్‌ప్రభాకర్, శ్యాసి మునిస్వామి, రాముడు, భాస్కర్,జీవన్, కార్తీక్, సంపత్,రవి, హిజ్రాయిల్, విజయ్, సూరి, సునిల్‌రాజు, మాణిక్యం, రాము, ప్రవీణ్, రాము, సురేష్, లక్ష్మన్న, మద్దిలేటి, హుస్సేన్, పురుషోత్తం, పాండు, మెసేక్,యెహోన్ సీమన్ తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికులకు అందరికి మోటార్ సైకిల్ ఇవ్వాలి

**-భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రాముడు**



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 27 ప్రభాతవార్త:**రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో కార్మిక శాఖ మంత్రి ప్రకటించిన విధంగా భవన నిర్మాణ కార్మికులందరికి సైకిల్ మోటార్లు ఇవ్వాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రాముడు అన్నారు. శుక్రవారం యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 54వేల నష్ట పరిహారాల నిధులను వెంటనే విడుదల చేయాలని, ప్రమాదంలో మృతి చెందిన కార్మికులకు ప్రమాదభీమా రూ.6 లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచాలని, సహజ మరణానికి రూ.1లక్ష నుంచి రూ.5లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు అశోక్, శ్రీనివాస్,సత్యం, లక్ష్మీనారాయణ, కేశవులు, శ్రీనివాస్, రఘు, సాధిక్ తదితరులు ఉన్నారు.

## ప్రతి మొక్కకు నీరు పోసి బతికించుకోవాలి..

**చెట్టు చెట్టు నీరు కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ జయంతి..**

**పెద్దమండడి, జనవరి 27 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ముందర తాండా గ్రామ పంచాయితీ సర్పంచ్ జయంతి శుక్రవారం చెట్టు చెట్టు నీరు కార్యక్రమంలో పాల్గొని మొక్కలకు నీరు పోసారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ జయంతి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హరితహారం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కార్యక్రమంలో మొక్కలకు నీరుపోసి బ్రతికించుకునే బాధ్యత అందరిది అనే స్థానిక సర్పంచ్ జయంతి అన్నారు. మొక్కలు వృక్షాలు అయి మంచి వాతావరణం గాలి వర్షాలు బాగా పడతాయని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం హరితహారం భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని మనం కూడా మొక్కలకు నీరు పోసి బ్రతికించుకునే బాధ్యత అందరికి ఉందని ఆమె అన్నారు. అదే విధంగా ఎంపీడీఓ అఫ్జల్ పాల్గొని నర్సరీలలో పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ నర్సరీలో మొక్కలకు ఉదయం సాయంకాలం నీళ్లు పోసి పెరుగుదలకు కృషి చేయాలని అన్నారు. వారితి పాటు పంచాయితీ కార్యదర్శి పాల్గొన్నారు.


చెట్టు చెట్టు నీరు కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ జయంతి


నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ అఫ్జలుద్దీన్

## పోలీస్ స్టేషన్ ముందు కాంగ్రెస్ శ్రేణులు ధర్నా..

**ఎస్సైను సస్పెండ్ చేయాలని డిమాండ్**

**లింగాల, జనవరి 27 ప్రభాతవార్త :** మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రధాన రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఎస్సై శ్రీనివాసులు అధికార పార్టీకి కొమ్ముకాస్తున్నాడని కాంగ్రెస్ పార్టీ వారిపై అక్రమ కేసులు బనాయిస్తూ వేధింపులకు గురి చేస్తున్నారని మండల పార్టీ అధ్యక్షులు నాగేశ్వర్‌రావు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ రాథోడ్ ఆరోపించారు. 26న సూరపూర్‌కు చెందిన శివరాజు అనే వ్యక్తి శాయిన్‌పేటకు ఫిల్టర్ వాటర్ అమ్ముకోవడానికి వెళ్లగా టిఆర్ఎస్ పార్టీకి అదే గ్రామానికి చెందిన భాస్కర్‌రెడ్డి ఫిల్టర్ వాటర్ అమ్ముకోవడాన్ని అడ్డుకున్నారని, అంతేకాక శివరాజును కొట్టడం, ఆటో అద్దాలు పగలకొట్టడం జరిగిందని వారు తెలిపారు. కానీ ఎస్సై ఎలాంటి విచారణ చేయకుండా భాస్కర్‌రెడ్డి ఫిర్యాదుతో శివరాజు తండ్రి నిరంజన్‌ను పిలిపించి నానా బూతులు తిడుతూ కొట్టారని వారు ఆరోపించారు. అంతేకాక గతంలో ఎన్నో అక్రమ కేసులు బనాయించారని ఎస్సైపై చర్యలు తీసుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని తెలిపారు. బల్మూరు శివనంద్‌గౌడ్ ఆందోళన చేస్తున్న వారి నుంచి ఫిర్యాదు తీసుకుని ఫిర్యాదును ఉన్నత అధికారులకు పంపించడం జరుగుతుందని తెలపడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్‌విండో ఛైర్మన్ కొండల్‌రావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు జ్ఞానేశ్వర్‌రెడ్డి, పూజారి వెంకటయ్య, మాజీ సర్పంచ్‌లు మల్లయ్య, శ్రీశైలం, తరుణ్, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.


పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించి ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

## రేటి నుండి చింతల వెంకటేశ్వరుడి ఉత్సవాలు..

**పెబ్బేరు, జనవరి 27 ప్రభాతవార్త:** రేపటి నుండి పెబ్బేరు మండలం రంగాపురం గ్రామంలో చింతల వెంకటేశ్వర స్వామి ధ్వజస్థంభం ఉత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎన్.కృష్ణా రెడ్డి, వాసుదేవా రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29 నుండి ఫిబ్రవరి 1వ తేదీ వరకు 4రోజుల పాటు వైభవంగా ఉత్సవాలను దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. రోజు వారీగా జరిగే కార్యక్రమాలు 29 ఆదివారం సాయంత్రం 6గంటలకు విశ్వక్సే నారాధన, పుణ్యాహవాచనం, వేదపారాయణం, చతుస్థానార్చన. నిత్య పూర్ణాహుతి, శాత్తుమైరై, తీర్థప్రసాద వితరణ జరుగును. 31వ తేదీ మంగళవారం 8గంటలకు వేదపారాయణం, చతుస్థానార్చన, క్షీరాధివాసము, సుదర్శన నారసింహ సహిత లక్ష్మీ వెంకటేశ్వర వరాహం, నిత్య పూర్ణాహుతి, కర్మంగ స్నపనం, శాత్తుమైరై తీర్థగోష్టి మధ్యాహ్నం 2గంటలకు గ్రామోత్సవం, సాయంత్రం 6గంటలకు విష్ణు సమస్త్రనామ పారాయణం, చతుస్థానార్చన, ఆదివాస హోమం, యంత్ర శక్యాది, హోమం, సత్యాపూర్ణాహుతి శయాధివాసం, ఛాయాధివాసం, శాత్తుమైరై తీర్థ ప్రసాద వితరణ. ఫిబ్రవరి 1బుధవారం ఉదయం 4గంటలకు గర్తపూజ తదనంతరం 4.30గంటల నుండి 5.10గంటల వరకు ధనుర్లగ్న శుభపుష్కరాంశమున, మహాయంత్రం స్థాపన, బొడ్రాళ్ల ప్రతిష్ఠ, ద్వారాలపాలక, నవగ్రహ, గణపతి, గరుడ, బలిపీఠ, నాగ, గండాదీపా ప్రతి కార్యక్రమాలు జరుగునని ఇట్టి కార్యక్రమానికి చివరి రోజు వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి దంపతులు పూజ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.


రంగాపురం గ్రామంలో చింతల వెంకటేశ్వర స్వామి ఆలయం

## కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలించిన అధికారులు

**బిజినేపల్లి, జనవరి 27 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా వైద్యారోగ్య శాఖ ద్వారా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బిజినేపల్లి మండల పరిధిలోని లట్టుపల్లి రైతు వేదికలోని కంటి వెలుగు శిబిరాన్ని జిల్లా క్వాలిటి కంట్రోల్ ఆఫీసర్ డా. డి. పవన్ కుమార్‌రెడ్డి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రోగికి కంటి వెలుగు శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి అందులో ప్రత్యేక అవసరాలు ఉన్న వారిని గుర్తించి చికిత్సలు అందించే విధంగా సూచించాలన్నారు. దగ్గర చూపుల్లో దృష్టి లోపం ఉన్నవారికి అందుబాటులోని సరైన అద్దాలను వెంటనే అందజేయాలని తెలిపారు. దూరపుచూపు లోపం ఉన్నవారిని గుర్తించి అంతర్జాలంలో కంటి అద్దాలకు వివరాలు నమోదు చేసి పంపాలని సూచించారు. రోగులకు శిబిరాలలో మెరుగైన కంటి సేవలు అందించాలని అన్నారు. అనంతరం లట్టుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా భూగర్భజల మండల ప్రత్యేక అధికారి రమాదేవి గర్భిణీలకు న్యూట్రిషన్ కిట్ల పంపిణీ చేశారు. గర్భస్థ సమయంలో ప్రభుత్వం అందించిన న్యూట్రిషన్ కిట్లను తప్పనిసరిగా వినియోగించుకుని ఆరోగ్యం మెరుగుపరచుకోవాలని, రక్తహీనత నివారణకు, పౌష్టికాహార లోప నివారణకు కిట్లు తోడ్పాటు అవుతాయన్నారు. గర్భిణీలు ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు జరుపుకోవాలని లట్టుపల్లి వైద్యాధికారి డా. బి. శ్రీకాంత్ వారికి సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డా. తేజస్విని, ఆరోగ్య విస్తీర్ణాధికారి పోల శ్రీధర్, పర్యవేక్షకురాలు సరళ, ఆరోగ్య కార్యకర్తలు టి.యాదగిరి, జ్యోతి, జకియాబేగం, సుమిత్ర, దివ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో

## శాశ్వత ప్రతిపాదికన ఉద్యోగులకు ధరఖాస్తుల స్వీకరణ

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి27 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో శాశ్వత ప్రతిపాదికన నిర్వహిం చనున్న మెడికల్ ట్రేడ్ ఓపెన్ రిక్రూట్మెంట్ ర్యాలీకి ఆసక్తి కలిగిన నిరుద్యోగులు హాజరుకావాలని వింగ్ కమాండర్ సజ్జశ్రీచైతన్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టులు కేవలం దక్షిణ భారతదేశం రాష్ట్రాల నుంచి మాత్రమే రిక్రూట్మెంట్ నిర్వహిస్తున్నందున అభ్యర్థులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ పోస్టులు పురుషులకు మాత్రమే వర్తిస్తాయని, ఎంపికైన వారికి మంచి జీతంతో పాటు ఫించన్‌తో కూడిన శాశ్వత ఉద్యోగం ఉంటుందన్నారు. ఇంటర్మీడియట్‌లో బయాలజీ సబ్జెక్టుతో ఉత్తీర్ణులైన వారు, బీఎస్సీ నర్సింగ్ చేసిన వారు ఈ ఉద్యోగానికి అర్హులుగా పరిగణిస్తారన్నారు. బైపీసీతో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన వారు ఫిబ్రవరి 4వ తేదీన, బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన వారు ఫిబ్రవరి 7వ తేదీన ఎయిర్ ఫోర్స్ స్టేషన్ తంబారం చెన్నైలో నిర్వహించే ఓపెన్ రిక్రూట్మెంట్ ర్యాలీకి హాజరు కావాల్సి ఉంటుందన్నారు. తెలంగాణ నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు వాట్సాప్ నెంబరు 9345377868కు సంప్రదించాలన్నారు.

# మరింత ఉత్సాహంతో పనిచేద్దాం..


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కె.నరసింహ


సమావేశానికి హాజరైన పోలీసు సిబ్బంది, అధికారులు

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, జనవరి 27 ప్రభాతవార్త :** సిబ్బంది, అధికారులు ఉత్సాహంగా పని చేస్తున్నారని అదే స్పూర్తితో

## సిబ్బంది పోలీసు ఉన్నతాధికారులతో సమావేశమైన ఎస్పీ కె. నరసింహ

మరింత ఉత్సాహంగా ముందుకు వెళ్తూ ప్రజలకు సేవలు అందించాలని మహబూబ్‌నగర్ ఎస్పీ కె.నరసింహ అధికారులకు సూచించారు. జిల్లా పోలీసు సమావేశాలలో ఎస్పీ కె. నరసింహ పరిపాలన సిబ్బందితో సమావేశమై అందరిని పరిచయం చేసుకున్నారు. కార్యనిర్వాహక సిబ్బంది (ఎగ్జిక్యూటివ్ స్టాఫ్) అందరు ఎక్కడెక్కడో విధులు నిర్వహిస్తుంటారు. వారికి చెందాల్సిన అన్ని రకాల బెనిఫిట్స్ (జీత బత్యాలు, రవాణా అలవెన్స్‌లు, లీవులు) ఇతర ఏమున్నాగాని త్వరగా చేయమని ఆదేశించారు. ప్రస్తుతం సిబ్బంది, అధికారుల పనితీరు బాగుందని, ఇకముందు కూడా ఇదే ఉత్సాహంతో త్వరగా పనిచేసి అవార్డు, రివార్డులు అందుకోవాలని సూచించారు. అలాగే ఈ రోజు జిల్లా పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వెంకటయ్య, ఆర్గనైజింగ్ సెక్రెటరీ చిన్న మద్దిలేటి, కోశాధికారి ప్రసాద్, అసోసియేషన్ తరపున జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రాములు, ఏఓ రుక్మిణి, పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు.

## జంతువులు, వన్యప్రాణుల పట్ల కరుణతో వ్యవహరించాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 27 ప్రభాతవార్త :** జంతువులు, వన్యప్రాణుల పట్ల కరుణతో వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. జనవరి 14 నుండి 31వ తేదీ వరకు జరుగుతున్న జంతు సంక్షేమ పక్షోత్సవాల్లో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం కలెక్టరేట్ విడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జంతు సంక్షేమ సంస్థ ఛైర్మన్/జిల్లా కలెక్టర్ అధ్యక్షతన పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సమన్వయ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జంతువులను హింసించడం వాటిని బహిరంగంగా బలిచేయడం, వన్యప్రాణులను వేటాడటం వంటివి నేరుగా పరిగణించడం జరుగుతుందని హెచ్చరించారు. జంతువులు, వన్యప్రాణుల పట్ల కరుణ చూపించాలని ఎక్కడైనా దొరికిన అటవిశాఖ వారికి అప్పగించడం, అడవిలో వదిలేయడం చేయాలని తెలిపారు. పెంపుడు జంతువులకు ఎప్పటికప్పుడు రోగనిరోధక టీకాలు ఇప్పించాలని తద్వారా రేబిస్ లాంటి ప్రాణాంతక వ్యాధినుండి జంతువులతో పాటు మనుషులు రక్షణ పొందవచ్చని సూచించారు. మాంసానికి ఉపయోగించే మేకలు, గొర్రెలు వాటిని బహిరంగ ప్రదేశాల్లో కాకుండా స్లాటర్ కేంద్రాల్లోనే వధించాలని అదికూడా వైద్య పరీక్షలు నిర్వహించి ఎలాంటి అనారోగ్యంతో లేదని డాక్టర్ ద్వారా ధృవీకరణ పొందాకే బలిచేయాలన్నారు. వీధి కుక్కలను నియంత్రించడానికి కుటుంబ నియంత్రణ పద్దతులు అమలు చేయాలని పశు సంవర్ధకశాఖ అధికారిని ఆదేశించారు. రోడ్లపై పశువులు చాలా కూర్చుంటున్నాయని వాటిని గోశాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జంతువులను వాహనంలో తరలించేటప్పుడు ఒకే వాహనంలో ఇరుకుగా ఎక్కువ జంతువులను తరలిస్తే గుర్తించి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర జంతు సంక్షేమ సంస్థ ద్వారా రూపొందించిన కరదీపికను విడుదల చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్, జిల్లా పశుసంవర్ధక అధికారి డా. శ్రీనివాస్, అటవిశాఖ నుండి శ్రీనివాసులు, డైరీఫాం నుండి మెంబర్లు జి.రాఘువరెడ్డి, గోశాల నుండి మెంబర్ అశోక్ పాల్గొన్నారు.


విడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

## దళిత బంధు ఎమ్మెల్యేలు పంచె ఫలహారమా..

**- దళితబంధుకు కేటాయించిన రూ.17700 కోట్ల నిధులను వెంటనే విడుదల చేయాలి...**

**- కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు అంతటి కాశన్న**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 27 ప్రభాతవార్త:** కుల వివక్ష పోరాట సంఘం ఆధ్వర్యంలో పెండింగ్‌లో ఉన్న దళితబంధు నిధులు వెంటనే విడుదల చేయాలని, దళితబంధు అందరికి ఇవ్వాలని నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని గాంధీ పార్క్ నుంచి కలెక్టరేట్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. అనంతరం ఆ సంఘం జిల్లా అధ్యక్షులు అంతటి కాశన్న మాట్లాడుతూ దళితులు అందరికి దళిత బంధు ఇవ్వాలని, దళితబంధు కేటాయించిన రూ.17700 నిధులను వెంటనే విడుదల చేసి రెండో విత ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నియోజకవర్గానికి 1500 యూనిట్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. దళితులందరు రాజకీయాలకతీతంగా దళితబంధు కోసం ఉద్యమించాలన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి 8 ఏళ్ల గడుస్తున్న దళితులకు ఒక్కటి కూడా అమలు చేయలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు, నాయకులు పర్వతాలు, హన్మంతు, జగన్, రాజు, సత్యనారాయణ, హన్మంతు తదితరులు ఉన్నారు.



ర్యాలీగా వెళ్తున్న కేవీపీఎస్ నాయకులు

## పకడ్బందీగా కంటి వెలుగును నిర్వహించాలి..

**ఇటిక్యాల కంటి వెలుగును తనిఖీ చేసిన ప్రత్యేక అధికారి డా.దివ్య**

**ఇటిక్యాల, జనవరి 27 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం అంధత్వం లేని రాష్ట్రంగా తయారు చేసేందుకు రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమం చేపడుతుందని గ్రామీణ స్థాయిలో చేపడుతున్న కంటి వెలుగును పకడ్బందీగా నిర్వహించాలని కంటి వెలుగు ప్రత్యేక అధికారి డా. దివ్య ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఇటిక్యాలలో కొనసాగుతున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అర్హులైన వారందరికి పరీక్షలు నిర్వహించిన తర్వాత కళ్లద్దాలు పంపిణీ చేయాలని, మిగతా వారికి కళ్లద్దాలు అవసరమైన వారికి డాటాఎంట్రీ ఆపరేటర్లు ట్యాబ్‌లో ఆన్‌లైన్ నమోదు చేయాలని కంటి వెలుగులో ఓపి సంఖ్య నిర్దేశించిన ప్రకారం నమోదు చేయాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. కంటి వెలుగు డాక్టర్లు, ఆప్తాలమిస్టు టెక్నిషియన్లు కంటి పరీక్షలు బాగా నిర్వహించి ఉచిత మందులు, ఐ డ్రాప్స్ పంపిణీ చేయాలని అన్నిరకాల ఐ డ్రాప్స్ మందులు అందుబాటులో ఉంచుకోవాలని ట్యాబ్‌లలో నమోదు చేసే సమయంలో తప్పులు దొర్లకుండా చూసుకోవాలని టేబుళ్లవారిగా సిబ్బంది విధులు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్లు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.


ఇటిక్యాల మండల కేంద్రంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి డా. దివ్య

## ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ముందు అంగన్వాడీ టీచర్ల ధర్నా..

**అమరచింత, జనవరి 27 ప్రభాతవార్త:** అంగన్వాడీ టీచర్లకు కనీస వేతనం రూ.21వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీఐటీయు ఆధ్వర్యంలో శుక్రవారం ఆత్మకూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి టి.శ్రీహరి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 70వేల అంగన్వాడీ టీచర్లు పని చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీస వేతనం అమలు చేయడం లేదని ఆయన అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం 1972 గ్రాట్యుంటి చట్టం అమలు చేసి అంగన్వాడీ టీచర్లకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అంగన్వాడీ టీచర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5లక్షలు, అంగన్వాడీ హెల్పర్స్ కు రూ.3లక్షలు ఇవ్వాలని అలాగే హెల్త్ కార్డులు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే అంగన్వాడీ టీచర్లకు 2018లో కేంద్ర ప్రభుత్వం వేతనాలు పెంచిన ఇప్పటివరకు అమలు చేయడం లేదని తక్షణమే అమలు చేయాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సీడీపీఓ భారతికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అమరచింత, ఆత్మకూర్, కొత్తకోట, మదనాపురం మండలాలకు చెందిన అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.


ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారికి వినతిపత్రం అందిస్తున్న సీఐటీయు

## వీఆర్ఏ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుంది

**తహసిల్దార్ సుబ్రహ్మణ్యం**

**ఇటిక్యాల, జనవరి 27 ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఉదండాపురం గ్రామంలో విఆర్ఏగా పని చేస్తున్న మునెన్న (52) కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ అనారోగ్యానికి గురై గురువారం గ్రామంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న తహసిల్దార్ సుబ్రహ్మణ్యం. ఆర్ఐ సుదర్శన్‌రెడ్డి శుక్రవారం గ్రామానికి చేరుకుని భౌతికకాయానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు. అనంతరం ప్రభుత్వం నుంచి అందించే దహన సంస్కారాల నిమిత్తం రూ. 10 వేలు తహసిల్దార్ బాధిత కుటుంబానికి అందజేశారు. అదేవిధంగా జోగులాంబ గద్వాల జిల్లా విఆర్ఏల సంఘం జెఏసి కన్వీనర్ రాములు, కో కన్వీనర్‌లు శివశంకర్, మహేష్, మండల విఆర్ఏల సంఘం ఛైర్మన్ బీసన్న, అధ్యక్షుడు గోపన్న, కన్వీనర్ నరసింహ తదితర విఆర్ఏలు భౌతిక కాయానికి నివాళులర్పించి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసి బాధిత కుటుంబానికి భరోసా కల్పిస్తూ ప్రభుత్వ పరంగా ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు కృషి చేస్తామన్నారు. మృతునికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు.

## జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా 225 ఎకరాల్లో ఆయిల్‌ఫామ్ తోటలు సాగు..


ఆయిల్ ఫామ్ తోటలను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారులు

**వనపర్తి ప్రతినిధి, జనవరి 27 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగు ప్రోత్సహించే ఉద్దేశంతో 2020-21 ఆర్థిక సంవత్సరంలో నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ మిషన్ క్రిందట పైలెట్ ప్రాజెక్టుగా 225 ఎకరాలలో ఆయిల్ ఫామ్ తోటలు నాటడం జరిగింది. ఈ ఆయిల్ పామ్ తోటల్లో పరాగ సంపర్కానికి అవసరమైన కీటకాలను విడవడానికి అనుకూలతను పరిశీలించడంలో భాగంగా శుక్రవారం అమరచింత మండల పామిరెడ్డి పల్లి గ్రామంలో రైతు రామలక్ష్మా రెడ్డి ఆయిల్ ఫామ్ తోటను జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి కె.సురేష్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రీ యూనిక్ ఆయిల్ ఫామ్ కంపెనీ డిప్యూటీ జనరల్ మేనేజర్ రామ్మోహన్ రావుచ కొత్తకోట ఉద్యాన అధికార ఎన్.సురేష్, ప్రీ ఆయిల్ ఫామ్ కంపెనీ ఏరియా మేనేజర్ సుమంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సికిరి చెట్టు తాండాల్లో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించిన స్థానిక సర్పంచ్ రాధాకృష్ణ..


కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ రాధాకృష్ణ

**పెద్దమండడి, జనవరి 27 ప్రభాతవార్త:** మండల పరిధిలోని సికిరె చెట్టు తాండాలో శుక్రవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ రాధాకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ రాధాకృష్ణ మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టంగా కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుంది ప్రతి ఒక్కరు కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కంటి చూపు బాగుంటే ప్రపంచాన్ని చూడొచ్చని అన్నారు. కంటి నిండా వెలుగు నింపడానికే ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని అన్నారు. తప్పక కంటి వెలుగు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కంటి వెలుగు కార్యక్రమంలోని కంటి పరీక్షలు చేయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అఫ్జల్, ఏపీఎం వెంకన్న, సీసీ ఆంజనేయులు మరో వైద్య సిబ్బంది ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటుదాం...

## ప్రాణ వాయువును అందిద్దాం..

**ప్రముఖ కమెడియన్, జబర్దస్త్ ఫేమ్ తాగుబోతు రమేష్, కొమురక్క**

**బిజెపి రాజాపూర్ మండల అధ్యక్షుడు కావలి రామకృష్ణతో కలిసి మొక్కలు నాటిన ఆర్టిస్టులు**

**హాజరైన జర్నలిస్టు మలెద శ్రీశైలం, బిజెపి నాయకులు శేఖర్**

**రాజాపూర్, జనవరి 27 ప్రభాతవార్త :** పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అన్న చందాన చెట్లను నాటి వాటిని మనం కాపాడితే అవి తిరిగి మనలకు ప్రాణవాయువు అందించి బ్రతికిస్తాయని ప్రముఖ కమెడియన్, జబర్దస్త్ ఫేమ్ తాగుబోతు రమేష్, కొమురక్క, రాజాపూర్ మండల బిజెపి అధ్యక్షులు కావలి రామకృష్ణ తదితరులు పేర్కొన్నారు. శుక్రవారం జడ్చర్ల నియోజకవర్గం రాజాపూర్ మండల కేంద్రంలోని రామకృష్ణకు చెందిన మామిడి తోటలో ఆర్టిస్టులు మొక్కలు నాటే కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్క నాటడం ఎంత ముఖ్యమో వాటిని సంరక్షించడం కూడా అంతే బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలో ప్రతిఇంటి దగ్గర ఒక మొక్కను నాటి గ్రామాల్లో పచ్చదనం ఉండేటట్లు చూసుకోవాలన్నారు. అదేవిధంగా అడవుల సంరక్షణలో మన పాత్ర ఎంతో అవసరమని, అడవులు బాగుంటేనే వన్యప్రాణుల సంరక్షణ ఉంటుందని అభిప్రాయపడ్డారు. ప్రతి ఒక్కరు కనీసం ఒక్క మొక్కయినా నాటి 2023కు స్వాగతం పలుకుదామని పిలుపునిచ్చారు. జీవులకు జీవనాధారం చెట్లు... కొత్త సంవత్సరంలో కొత్త ఆశను పెంచుదామంటూ పిలుపునిచ్చారు. మొక్కలు నాటే కార్యక్రమంలో జర్నలిస్టు మల్దే శ్రీశైలం, బిజెపి నాయకులు శేఖర్, రాజాపూర్ గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న జబర్దస్త్ కమెడియన్స్